సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 22-3-2024 15/-




## పౌరసత్వ చట్టం ఎవరికి చుట్టమో?



వరాల మాసం... శుభాల మాసం... రమజాన్



సహజీవన భావనల పావురాయి
# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 12 హైదరాబాద్
శుక్రవారం 22 మార్చి 2024 రూ.15-00
11 రమజాన్ 1445 హిజ్రీ

**తొలిగీటు**

రమజాన్ మాసంలో యజమాని తన సేవకునితో తేలికైన పని చేయిస్తే అల్లాహ్ అతన్ని క్షమించి నరకాగ్ని నుండి విముక్తి కలిగిస్తాడు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**


**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**



26

## దేవుడు ఇచ్చిన అద్భుత ఒనరు నీరు

## లోపల...


| | | |
|---|---|---|
| తప్పు కాదు కదా?? | ...... | 04 |
| పౌరసత్వ చట్టం ఎవరికి చుట్టమో? | ...... | 05 |
| విచక్షణా ప్రమాణం–21 | ...... | 09 |
| చరితార్థులు–2 : మౌలానా షాహ్ అబ్దుల్ రహీం రాయ్‌పూరి | ...... | 12 |
| ఆధ్యాత్మిక వికాసమే కాదు అంతర్గత విప్లవం కూడా... | ...... | 13 |
| జీవితం చాలా విలువైనది! | ...... | 14 |
| వరాల మాసం... శుభాల మాసం... రమజాన్ | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| మానవ జీవితంపై తౌహీద్ ప్రభావం | ...... | 20 |
| నూతన విద్యా విధానం ముందున్న సవాళ్ళు | ...... | 23 |
| మాడ్రన్ ముస్లిం!! | ...... | 32 |
| వ్యాధిగ్రస్తుల పరామర్శ అల్లాహ్ ప్రసన్నతకు మార్గం | ...... | 34 |


## గద్దె దించాల్సిందే...




మరొక సారి మోడీకి
కట్టబెడితే అధికారం
రాజ్యాంగం మార్చేసి
మనుస్మృతికి శ్రీకారం!
మేలుకోండి యికనైనా
మార్చండోయ్ తాతను
సీసా లోపల బంధించి
బిగించండి మూతను!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

ఆలోచన

# తప్పు కాదు కదా??

**ఉత్తరాఖండ్‌లో** సొరంగంలో చిక్కుకుపోయిన వారి గురించి వార్తలు చాలా మంది వినే ఉంటారు. వారిని కాపాడ్డానికి జరిగిన ప్రయత్నాల గురించి కూడా చాలా మందికి తెలిసే ఉంటుంది. కాని ఆ రెస్క్యూ ఆపరేషన్లో హీరో అయిన వకీల్ హసన్ కథ ఎంతమందికి తెలుసు. అలాగే గోరఖ్‌పూర్ ఆసుపత్రిలో పసిపిల్లలు ఆక్సిజన్ లేక ప్రాణాలు వదులు తున్నప్పుడు పిల్లలను కాపాడ్డానికి తన స్వంత డబ్బు ఖర్చు చేసి ప్రయత్నించిన డాక్టర్ కఫీల్ ఖాన్ గురించి ఎంత మందికి తెలుసు. వకీల్ హసన్, కఫీల్ ఖాన్ ఇద్దరు తమ స్థాయిలో ఇతరుల ప్రాణాలు కాపాడ్డానికి ప్రయత్నించారు. ఇద్దరు ప్రాణరక్షణ ప్రయత్నాలు చేస్తున్నప్పుడు అవతలివారు హిందువులా? ముస్లిములా అన్నది చూడలేదు. కాని ఇద్దరు ముస్లిములైన పాపానికి కష్టనష్టాల్లో చిక్కుకోవడమే నేటి వినూత్న భారతం.

ఉత్తరాఖండ్ సొరంగం కూలిపోయి 41 మంది కార్మికులు లోపల చిక్కుకుపోయినప్పుడు వారిని కాపాడ్డానికి అమెరికా నుంచి తీసుకొచ్చిన యంత్రాలు కూడా విఫలమయ్యాయి. 17 రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలు చేతులెత్తేసినప్పుడు వకీల్ హసన్ ముందుకొచ్చి కాపాడాడు. వకీల్ హసన్ సంస్థ రాక్వెల్ ఎంటర్ప్రైజెస్ ఈ పని చేసి చూపించింది. హసన్ బృందం సాహసోపేతమైన రెస్క్యూ ఆపరేషన్ జయప్రదంగా పూర్తి చేసింది. చిక్కుబడిన కార్మికులను విడిపించి దేశవ్యాప్తంగా ప్రజల మన్ననలు పొందారు.

డాక్టర్ కఫీల్ ఖాన్ కథ వేరు. గోరఖ్‌పూర్ ఆసుపత్రిలో పిల్లలు ఆక్సిజన్‌లేక చస్తున్నప్పుడు వారి ప్రాణాలు కాపాడ్డానికి ఆయన చేసిన ప్రయత్నాలు అప్పట్లోనే మీడియా ప్రస్తుతించింది. ఎంత వేగంగా అతన్ని పొగడ్డం జరిగిందో అంతే వేగంగా కష్టాలు వచ్చి మీదపడ్డం ప్రారంభం అయ్యింది. నోడల్ అధికారి పదవి నుండి తొలగించారు, అరెస్టు చేశారు, రుజువు కాని ఆరోపణలతో నెలల తరబడి జైల్లో పెట్టారు. కారణమేమిటి? కేవలం ముస్లిం కావడమే అంటే తప్పుకాదు కదా?

ఉత్తరాఖండ్ సొరంగం రెస్క్యూ కేసులో అందరు ప్రశంసించిన వకీల్ హసన్ కథ చూద్దాం. హసన్ ఇల్లు ఖజూరి ఖాస్‌లో ఉంది. ఆ ఇంటిని ఢిల్లీ డెవలప్మెంట్ అథారిటీ, సరైన ప్రక్రియ లేకుండా కూల్చివేసింది. భార్య, పిల్లలతో సహా అతని కుటుంబం రోడ్డున పడింది. ఫుట్‌పాత్‌పై ఉండవలసి వచ్చింది. హసన్ ఇంటిని కూల్చడంలో వివక్ష స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. పొరుగున ఉన్న హిందూ ఇండ్లను ఢిల్లీడెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు తాకనైనా తాకలేదు. కేవలం ముస్లిం పేరు కనిపించిన హసన్ ఇంటిని మాత్రమే కూల్చేశారు. హసన్ ఉత్తరాఖండ్ సొరంగం రెస్క్యూలో కీలకపాత్ర పోషించిన విషయం తమకు తెలియదని నాలిక్కర్చుకున్నారంట. అంటే ఇంటిని కూల్చే సమాచారం కుటుంబానికి ఇవ్వలేదన్నమాట. ఒకవేళ ఈ సమాచారం ముందే చెప్పి ఉంటే కుటుంబసభ్యులు హసన్ ఎవరనేది చెప్పి ఉండేవారే కదా. పచ్చి అబద్దాలు ఆడడంలో అధికారులు కూడా రాజకీయ నాయకులను తలదన్నుతున్నారు.రాత్రిపూట రహస్య ఆపరేషన్ జరిపి హసన్ ఇంటిని కూల్చేశారు.

"వకీల్ హసన్ ఇంటికి ఎడమ వైపున అశోక్ గోయల్ ఇల్లు, కుడి వైపున ప్రదీప్ జైన్ ఇల్లు ఉన్నాయి. ఆ ఇళ్ళను ముట్టుకోలేదు. వకీల్ ఇంటిని కూల్చేసి, కొన్ని గంటల్లో సిమెంటు గోడ కూడా అక్కడ కట్టేశారు.

డాక్టర్ కఫీల్, వకీల్– ఈ ఇద్దరి కథల వల్ల ఏం తెలుస్తోంది? పదిమందికి సహాయపడే పని చేసినా, తోటివారిని ఆదుకోవడానికి పనిచేసినా.. ఏం చేసినా.. ఒక ముస్లిం పేరు ఉంటే చాలు...అది అధికారులకు పదోన్నతులు సాధించి పెడుతుంది. రాజకీయ నాయకులకు ఓట్ల వానలు కురిపిస్తుంది.

డా కఫీల్ ఖాన్, వకీల్ హసన్ ముస్లిం పేర్లే వారి కష్టాలకు కారణమంటే తప్పు కాదు కదా???

అబ్దుల్ వాహెద్




# పౌరసత్వ చట్టం ఎవరికి చుట్టమో?

**వివాదాస్పద పౌరసత్వ** (సవరణ) చట్టం చేసిన నాలుగు సంవత్సరాల తరువాత, నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేయడానికి అవసరమైన నిబంధనలను మార్చి 11న ప్రకటించింది. పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి 2015 కి ముందు భారతదేశానికి వచ్చిన హిందువులు, పార్సీలు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, క్రైస్తవులకు పౌరసత్వం కల్పిస్తున్నామని చెప్పారు.

## నిరసనలు

వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం అమలుకు వ్యతిరేకంగా అసోమ్ నుండి ఢిల్లీ వరకు పౌరులు వీధుల్లోకి వచ్చి తమ తీవ్ర నిరసన ప్రకటించారు.

అస్సాంలో, ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ మరో 30 స్థానిక సంస్థలు కలిసిన సంకీర్ణం గౌహతి, బార్పేట, లఖింపూర్, నల్బరి, దిబ్రూగఢ్, తేజ్‌పూర్‌లతో సహా వివిధ జిల్లాల్లో సిఎఎ కాపీలను తగలబెట్టి, నిరసన ప్రకటించారు. నార్త్ ఈస్ట్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (నెసో) కూడా ఈ నిరసనలో చేరింది. ఈ ప్రాంతం లోని అన్ని రాష్ట్రాల రాజధానులలో సిఎఎ కాపీలను తగలబెడతా మని ప్రతిజ్ఞ చేసింది. సిఏఏకు వ్యతిరేకంగా ఈశాన్యం అంతటా అసమ్మతి స్వరాలు ప్రతిధ్వనిస్తున్నాయి.

మరోవైపు దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున, జామియా మిల్లియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో అసమ్మతి స్వరాలు మరోసారి ప్రతిధ్వనించాయి. ముస్లిం స్టూడెంట్స్ ఫెడరేషన్, కాంగ్రెస్ అనుబంధ నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియాతో సహా విద్యార్థి సంస్థలు సిఎఎకు వ్యతిరేకంగా గళం విప్పడంతో 2019 నాటి సిఎఎ వ్యతిరేక నిరసనల వాతావరణం మరోసారి కనిపించింది. ఉద్రిక్తత పెరగకుండా ఢిల్లీ పోలీసులు విశ్వవిద్యాలయ ప్రాంగణం, నగరంలోని ఇతర సున్నితమైన ప్రాంతాల చుట్టూ భద్రతా చర్యలను పెంచారు.

భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన సమానత్వం, లౌకికవాదం అనే ప్రాథమిక సూత్రాలను ఉల్లంఘిస్తున్న సిఏఏ చట్టాన్ని ఖండిస్తూ పౌరసమాజం సంయుక్త పత్రికా ప్రకటన విడుదల చేసింది. జమీఅత్ ఉలమా-ఎ-హింద్ అధ్యక్షుడు మౌలానా మహమూద్ అసద్ మదనీ, జమాత్-ఎ-ఇస్లామీ హింద్ అధ్యక్షుడు సయ్యద్ సాదతుల్లా హుస్సేనీ వంటి ప్రముఖ వ్యక్తులు సంతకాలు చేసిన ఈ ప్రకటనలో ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్లలో దౌర్జన్యాలకు గురై పారిపోయి వచ్చే ముస్లిమేతరులకు పౌరసత్వం ఇచ్చే చట్టం ఇదని స్పష్టంగా ప్రకటించారు. నిజానికి ఈ చట్టం ఎవరి నుంచి

పౌరసత్వాన్ని లాక్కునే చట్టం కాదు. ముస్లిముల నుంచి పౌరసత్వం లాక్కోవడం జరగదు. విదేశాల్లో పీడనకు గురైన వారిని కాపాడే చట్టం అంటున్నారు. కాని కాస్త ఈ వాదనను నిశితంగా పరిశీలించడం అవసరం. ఇటీవల యూట్యూబులో ఒక గొప్ప కథ దీనికి సంబంధించింది విన్నాను. అదేమిటంటే, నడిసముద్రంలో పడవ మునిగి ఇద్దరు మునిగిపోతున్నారు. వారికి దగ్గరలో ఒక పడవ ఉంది. దాన్ని చూసి కాపాడమని అరిచారు. ఆ పడవవాడు మునిగిపోతున్న వాళ్ళను కాపాడ్డానికి వచ్చాడు. మునిగిపోతున్న వారిలో ఒకడు ముస్లిము, మరొకడు హిందువు. కాపాడ్డానికి వచ్చిన పడవ వాడు హిందువు. ఇప్పుడు పడవవాడు ఇద్దరిని కాపాడాలా లేక మతం చూసి కాపాడాలా? ముస్లింతో, సారి బ్రదర్, మరో ముస్లిం పడవవాడు నిన్ను చూసి కాపాడ్తాడులే అప్పటి దాకా వెయిట్ చేయి అని చెప్పి వెళ్ళిపోవాలా? ఈ కథకు మన చర్చకు పోలిక లేదనిపిస్తే మీకు అలా అనిపించవచ్చు. కాని మానవీయ విలువలతో పౌరసత్వం ఇవ్వాలని నిర్ణయించుకున్న చట్టంలో మత ప్రాతిపదిక ఎలా కనిపిస్తుందో అర్థమయ్యేలా చేసే కథే ఇది. ఇలాంటి మతవివక్షలో నైతికత ఉందా అన్నది ఆలోచించాలి. ఈ చట్టం సమానత్వానికి, అంతర్జాతీయ మానవ హక్కుల చట్టానికి విరుద్ధమైనదని, వివక్షతతో కూడిన చట్టమని అమ్నెస్టీ ఇండియా విమర్శించింది.

అంతర్జాతీయ రాజకీయాల్లో కూడా ఇప్పుడు జాతితత్వం బలపడుతోంది. బ్రిటన్ రాజకీయాలు వలసల చుట్టు తిరుగుతున్నాయి. వలసదారుల సంఖ్యను పరిమితం చేయడంలో విఫలమైతే కన్జర్వేటివ్ పార్టీ బలహీనపడుతుందని ప్రధాని రిషి సునాక్కు భయం పట్టుకుంది. అమెరికాలో, మితవాద రిపబ్లికన్లకు కూడా వలసలే ప్రధాన రాజకీయ సమస్య. మెక్సికోతో సరిహద్దు గోడను కట్టేస్తానని, మెక్సికో దాని ఖర్చు చెల్లించాలని డోనాల్డ్ ట్రంప్ చెప్పిన మాటలు చేసిన వాగ్దానాలు గుర్తు చేసుకోండి. ఇలాంటి విద్వేష, వలస రాజకీయాలు పాశ్చాత్య దేశాల్లోనే కాదు ఇప్పుడు కాస్త రూపం మార్చు

## నమ్మినా నమ్మకపోయినా ? 18

# మానవ నైజం తెలిసిన సృష్టికర్త

దేవుడు మానవుని సృష్టికర్త అయినందున మానవ నైజం ఆయనకు కాక మరెవరికి తెలుసు? మానవాళికి ఏది మంచో, మరేది చెడో; ఏది లాభదాయకమో మరేది హానికరమో ఆయనకే ఎరుక. ఆయన బోధనలు, ఆదేశాలు ఇంకా ఆయన మానవాళిపై కురిపించిన కరుణానుగ్రహాలు ఆయన అందించిన భావజాలంలోనే ఇమిడి ఉన్నాయి. ఆయన సంపూర్ణజ్ఞాని. మానవజాతి పట్ల ఆయన దయ, సమతుల్యత, సమానత్వం, న్యాయం ఆయన బోధనల సారాంశానికి సంకేతాలు. ఆయన బోధనలు మరియు లక్ష్యం మొత్తం మానవ జీవితాన్ని, పుట్టుక నుండి మరణం వరకు జీవితంలోని అన్ని అంశాలను పరివేష్టించి ఉన్నాయి. ఆ బోధనలు మానవ కుటుంబానికి మరియు సామాజిక జీవితానికి ఇంకా ఒక దేశం యొక్క సామూహిక జీవితానికి పరిపాలనా మార్గదర్శకాలను కూడా అందిస్తాయి.

**నమ్మినా నమ్మకపోయినా,** ఆయన భావజాలం దానికదే స్వీయ శక్తిని కలిగి ఉంటుంది, జీవితంలోని అన్ని సమయాలలో, అన్ని అంశాలలో ఒక అంతర్గత ఆచరణా శక్తి మనిషిని గమనిస్తున్నదన్న భావన ఈ భావజాలంలో ఇమిడి ఉంది – తనను ఎవరో ఒక పోలీసు అన్ని వేళలా గమనిస్తున్నాడనే భావన ఆయనలో ఉన్నా లేకపోయినాసరే. దేవుని ముందు ప్రతి మనిషి తన లెక్కను సమర్పించుకోవడానికి తన జీవితంలోని సమస్త సమాచారం గురించి ఒక శ్రవణపేటిక (ఆడియో రికార్డ్) ఇంకా దృశ్యమాలిక (వీడియో) తయారవుతూనే ఉంది. ఈ సమాచారం ద్వారానే మనిషికి అన్ని విధాల పరలోకంలో సంపూర్ణ న్యాయం లభిస్తుంది. ఈ లోకంలో తన ఆచరణను బట్టి మంచి చేసినవారికి బహుమానంగా స్వర్గం లేక చెడు చేసినవారికి శిక్షగా నరకం లభించనున్నాయి పరలోకంలో.

సృష్టికర్త తన సిద్ధాంతాన్ని సర్వ మానవాళికి తన ప్రవక్తల ద్వారా, తన గ్రంథాల ద్వారా అన్ని కాలాల్లో, పుడమిపై ఉన్న ప్రతి దేశంలో, ప్రాంతంలో తెలియజేస్తూనే వచ్చాడు. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రవక్తలు తమ వ్యక్తిగత మరియు సామూహిక జీవితంలో వీటి ప్రకారం నడిచి మానవాళికి మార్గదర్శకులుగా నిలిచారు.

**నమ్మినా నమ్మకపోయినా,** సృష్టి ఆది నుండి ఈ మార్గదర్శకాలు, బోధనలు ఆయన గ్రంథాలు, సందేశహరుల ద్వారా దైవిక భావజాలం మానవాళికి అందుతూనే ఉంది. ఇక వాటిలో ప్రస్తుతం ఏది దేవుని నవీన గ్రంథం మరియు మరే ప్రవక్త అంతిమంగా పంపబడ్డారనే విషయాన్ని శోధించి తెలుసుకునే బాధ్యత మనిషిపైనే ఉంది. ఏది అంతిమ దైవ గ్రంథం ? ఎవరు దేవునిచే పంపబడిన అంతిమ ప్రవక్త? అనే విషయాలను తెలుసుకుంటే మనిషి అనుభవపూర్వకంగా, తార్కికంగా ఆలోచిస్తే అతను సంపూర్ణంగా సంతృప్తిని పొందగలుగుతాడు.

**- డా. ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**

కుని ఇతర దేశాలకు కూడా పాకాయి. బ్రిటన్ అమెరికాల్లో వలసలపై ఆంక్షలు పెడితే ముఖ్యంగా ప్రభావితమయ్యేది ఉపఖండంలోని దేశాలే. అప్పుడు మనం ఈ దేశాలను తీవ్రంగా విమర్శిస్తూ మాట్లాడతాం. కాని అలాంటి వివక్షే ప్రధానంగా ఉన్న సిఏఏను ఇక్కడ సమర్థిస్తారు.

ముఖ్యంగా ఎన్నికలకు ముందు లేవనెత్తిన ఈ చర్చను గమనించడం అవసరం. ఈ చట్టం కేవలం ముస్లిం దేశాల నుంచి వచ్చే ముస్లిమేతరులకు మాత్రమే వర్తించే చట్టం. మన పొరుగున కేవలం ముస్లిం దేశాలే ఉన్నాయా? దౌర్జన్యాల నుంచి పారిపోయి వచ్చేవాళ్ళు కేవలం ముస్లిమేతరులేనా? ఈ ప్రశ్నల గురించి ఆలోచించే అవకాశం ఈ చట్టం ఇవ్వదు. ముస్లిం దేశాల్లో ముస్లిమేతరులపై తీవ్రమైన హింసా దౌర్జన్యాలు జరుగుతున్నాయి కాబట్టి ఇలాంటి చట్టం చేయవలసి వచ్చిందనే అభిప్రాయాన్ని ప్రజల్లో కలిగించడం, అలా ముస్లిమేతరులను అంటే ముఖ్యంగా హిందువులను ఆదుకుంటున్నది తామే అని ప్రజల ముందుకు రావడం ద్వారా ఎన్నికల్లో గెలిచే ప్రయత్నాలివి. అందుకే లోక్ సభ ఎన్నికలు జరగబోయే ముందు పౌరసత్వ సవరణ చట్టం ఈ చర్చ మొదలయ్యేలా చేశారు.

న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది రాజ్యాంగ విరుద్ధమైనది కావచ్చు. మతం ఆధారంగా వివక్ష చూపకూడదనేది మన గణతంత్ర వ్యవస్థాపక సూత్రాలలో ఒకటి. సిఎఎ ప్రత్యేకంగా మతం ఆధారంగా ఉన్న చట్టం. ముస్లింలు తప్ప ఉపఖండంలోని ప్రతి మతానికి చెందిన ప్రజలు భారత పౌరసత్వం పొందవచ్చు. ముస్లింలను దూరంగా ఉంచడం చేయగలిగింది మేమే అని ప్రచారం చేయడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యంగాను, ఆ విధంగా ఎన్నికలు గెలిచే ప్రయత్నమే ఈ చట్టంగాను ఎవరైనా భావిస్తే అందులో తప్పేముంది?

ముస్లిం–మెజారిటీ దేశాలలో అణిచివేతలు భరించలేక పారిపోయి వస్తున్న వారికి సహాయపడే చట్టం అంటున్నారు. అణిచివేతలు కేవలం ముస్లిం మెజారిటీ దేశాల్లోనే ఉంటాయా? ముస్లిం మెజారిటీ దేశాల్లో అణిచివేతలకు గురయ్యేది కేవలం ముస్లిమేతరులేనా, ముస్లిములపై అణిచివేతలు ఉండవా? ఇలాంటి అనేక లాజికల్ ప్రశ్నలకు ఈ చట్టంలో జవాబులు దొరకవు. ఉదాహరణకు మయన్మార్లోని రోహింగ్యాలు భయంకరమైన హింసను ఎదుర్కొంటున్నారు. రోహింగ్యాలు ముస్లింలు. శ్రీలంకలో తమిళులు ప్రత్యేక ఈలం ఉద్యమం దేనికోసం నడిపారు? ఇలాంటి ప్రశ్నల గురించి ఆలోచించే పరిస్థితిలో ప్రస్తుతం ప్రజలు కూడా లేరు.

మానవీయ విలువలతో ఈ చట్టం చేసి ఉన్నట్లయితే శ్రీలంకతో సహా అన్ని దేశాలను దీని పరిధిలోకి తీసుకువచ్చి, ఆయా దేశాల్లో అణిచివేతలకు గురైె పారిపోయి వచ్చే వారందరినీ ముస్లిములతో సహా అందరినీ ఈ చట్టం పరిధిలోకి తీసుకురావాలి. కాని అలా చేస్తే రాజకీయ ప్రయోజనం ఏదీ ఉండదు. ముస్లిములను తప్పించడం వంటివి చేస్తేనే మతతత్వ రాజకీయాలు నడపవచ్చు. దీనిపై కేసు కోర్టులో నడిచి తీర్పు వచ్చే సరికి ఎన్నికలు ముగిసి రాజకీయాలు తల్లకిందులు అయిపోతాయి. అసలు ఈ చట్టం క్రింద ఇప్పటి వరకు పౌరసత్వం కావాలని నమోదు చేయించుకున్న వారు ఎంతమంది? కేవలం వేళ్ళపై లెక్కించదగినంత మంది మాత్రమే నమోదయ్యారని వార్తలు వచ్చాయి. దీన్ని బట్టి ఈ చట్టం అసలు ప్రయోజనం మతతత్వ రాజకీయాలన్నది స్పష్టంగా అర్థమవుతోంది.

దేశంలో శరణార్థులుగా వస్తున్నది ఎక్కువగా ఎవరు? శ్రీలంక, మయన్మార్‌ల నుంచి వచ్చేవాళ్లే ఎక్కువ ఉన్నారని ఇటీవలి వార్తల వల్ల తెలుస్తోంది. బంగ్లాదేశ్ నుంచి ఇప్పుడు వలసలు గతంలో మాదిరి లేనేలేవని వార్తలు వస్తున్నాయి. మయన్మార్ నుంచి అక్కడి ముస్లిం మైనారిటీ రోహింగ్యాలు శరణార్థులుగా వస్తున్నారు. భారతదేశంలో 13,000 మంది శరణార్థులుగా నమోదై ఉన్నారని తెలుస్తోంది. అలాగే శ్రీలంక నుంచి తమిళులు ఉన్నారు.

పెద్ద ఎత్తున హిందూ తమిళుల ఊచకోత జరిగినా శ్రీలంక ఈ చట్టం పరిధిలో లేదు. అంతర్యుద్ధం సమయంలో భారతదేశానికి వచ్చిన తమిళులు, ఇంకా అక్కడ హింసను ఎదుర్కొంటున్న హిందూ తమిళులకు చేస్తున్నదేమిటి? దాదాపు 150000 మందికి పైగా ఇలాంటి శరణార్థులు దుర్భర శిబిరాల్లో మగ్గుతున్నారు. అతి తక్కువ సంఖ్యలో ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గనిస్తాన్ శరణార్థుల గురించి చట్టం చేశారు కాని శ్రీలంక నుంచి వచ్చిన తమిళ శరణార్థులను ఎందుకు మరిచిపోయినట్లు?

## సిఎఎ నిజంగా శరణార్థులకు సహాయపడుతుందా?

పొరుగు దేశాల నుండి వేధింపులకు గురైన మైనారిటీలకు ఆశ్రయం కల్పించడమే సిఎఎ ఉద్దేశమని బిజెపి పేర్కొంది. నిజానికి దీని కోసం ప్రత్యేక చట్టం అవసరమా? శరణార్థులను ఆదుకోవడం వారికి సదుపాయాలు కల్పించడం ఇవన్నీ దేశం ఎప్పటి నుంచో చేస్తూ వస్తున్నవే. కొత్త ఏముంది? కొత్త కేవలం ముస్లిములను మినహాయించి మతవివక్ష ప్రదర్శించడం ద్వారా మతతత్వ ఓటుబ్యాంకును బలపరచుకోవడం. ఆ తర్వాత

ఎన్నార్సీ చేయించి ముస్లిములను పూర్తిగా అణిచేస్తామనే ఒక సందేశాన్నివ్వటం. అంతే తప్ప ఇందులో శరణార్థులకు సాయపడడం అనేది లేనేలేదు.

పౌరసత్వ (సవరణ) చట్టం పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదం పొందడం 2019 లోనే జరిగిపోయింది. కేవలం కొన్ని గంటల్లోనే ఈ చట్టాన్ని ఆమోదించేసుకున్నారు. అంతే వేగంగా రాష్ట్రపతి నుంచి సమ్మతి కూడా లభించింది. విచిత్రమేమిటంటే, అప్పుడు చేసిన చట్టానికి ఇప్పుడు 4 సంవత్సరాల తర్వాత నోటిఫై చేశారు. ఈ నాలుగు సంవత్సరాల కాలం పొరుగు దేశాల్లో అణిచివేతలు జరగలేదా? పొరుగుదేశాల్లో ఇప్పుడు హఠాత్తుగా ముస్లిమేతరులపై అణచివేతలు ఎక్కువైపోయాయా? ఇంత ఆలస్యంగా, ఇప్పుడే ఇంత హడావిడిగా ఎందుకు చట్టాన్ని అమలు చేయడానికి నడుం కట్టారో ప్రజలు కాస్త లోతుగా ఆలోచించాలి. పనిలో పనిగా ఇలాంటిదే త్రిపుల్ తలాక్ చట్టం.... ఈ చట్టం వల్ల దేశానికి ఏం లాభం కలిగింది? మహిళ లకు ఏం లాభం కలిగింది? ఎంత మంది ముస్లిం మహిళలకు లాభం కలిగింది? ఎన్ని కేసులు నమోదయ్యాయి? ఎన్ని కేసుల్లో శిక్షలు పడ్డాయి? ఎన్ని కేసుల్లో భర్తలు భార్యకు విడాకులివ్వ కుండానే వదిలేయడం జరుగుతోంది? ఈ డాటా కూడా కాస్త సేకరించి చూసుకుంటే, ఎంతో హడావిడిగా, దేశ ప్రజలకు చేసిన గొప్ప మేలుగా, బీజేపీ సాధించిన ఘనకార్యంగా తీసు కొచ్చిన త్రిపుల్ తలాక్ చట్టం సాధించిందేమిటో అర్థమవుతుంది. అలాగే ఇంతవరకు బంగ్లాదేశ్, పాకిస్తాన్, అఫ్గనిస్తాన్ దేశాల నుంచి పారిపోయి వచ్చి పౌరసత్వం కావాలని ధరఖాస్తులు చేసుకున్న వారెంతమంది? వంటి లెక్కలు తీస్తే ఈ పౌరసత్వ సవరణ చట్టం అవసరమెంతో కూడా అర్థమవుతుంది. కాని 2024 ఎన్నికల్లో గెలవాలంటే, సుప్రీంకోర్టులో ఎలక్టోరల్ బాండ్లపై జరుగుతున్న చర్చ నుంచి ప్రజల దృష్టి మరల్చాలంటే, మతతత్వ రాజకీయాలు నడపా లంటే ఇలాంటి చట్టం కావాల్సిందే.

సిఏఏకు దేశంలోని ముస్లిములకు ఎలాంటి సంబంధం లేదని, ఇది ఎవరి పౌరసత్వాన్ని తీసుకునే చట్టం కాదని, ఇతరదేశాల నుంచి వచ్చే వారికి పౌరసత్వం ఇచ్చే చట్టమని అంటున్నారు. ఇందులో వాస్తవాలేమిటో చూద్దాం.

ఇంతకు ముందు ఒకసారి హోంమంత్రి ఈ క్రోనాలజీని చక్కగా చెప్పేశారు. ముందు సిఏఏ చట్టం తీసుకువస్తారు. ఆ తర్వాత ఎన్నార్సీ చేయిస్తారు. ఎన్నార్సీలో పేరు నమోదు కావా లంటే కొన్ని పత్రాలు చూపించాలి. ఆ పత్రాలు పేదసాదల వద్ద ఉండవు. కాబట్టి చాలా మంది పత్రాలు లేని వారి పేర్లు ఎన్నార్సీలో నమోదు కావు. అలాంటి వారందరికి సిఏఏ క్రింద పౌరసత్వం ప్రసాదించేస్తారు. కాని ముస్లిం పేదసాదాలు, అవసరమైన పత్రాలు లేనివారు, పత్రాలు వరదల్లో కొట్టుకుపోవ డమో, అగ్నిప్రమాదంలో కాలిపోవడమో, అల్లర్లలో మాయమవ్వడమో లాంటిది ఏదైనా జరగవచ్చు, అలాంటి వారికి పౌరసత్వం ఉండదు. వారి ఓటు హక్కు లాక్కుంటారు. వారికి పౌరులుగా గుర్తింపు ఉండదు. వారికి ఎలాంటి పౌరసదు పాయాలు ఉండవు. వాళ్ళు బతికితే బానిసల్లా పడి బతకాలి. ప్రభుత్వం కావాలనుకుంటే వారిని బానిసల్లా నిర్బంధ శిబిరాలకు తరలించినా తరలించవచ్చు. ఇలాంటి నిర్బంధ శిబిరాలు అస్సాంలో కట్టారన్నది అందరు గుర్తించాలి.

ఏది ఏమైనా దేశంలో ఇప్పుడు రాజకీయాలంటే హిందు ముస్లిం వివాదాలుగా మారిపోయాయి. ఢిల్లీస్థాయిలో ప్రతిసారి ఎన్నిక లకు ముందు హిందుముస్లిం సమస్య ఏదోఒకటి ముందుకు వస్తుంది. అది లవ్ జిహాద్ కావచ్చు, త్రిపుల్ తలాక్ కావచ్చు, సిఏఏ కావచ్చు ఏదో ఒకటి హిందూ ఓట్లను తమవైపు మళ్ళిం చుకునే ఎత్తుగడ. గల్లీ స్థాయిలో రెసిడెన్షియల్ సంక్షేమ సంఘాల ఎన్నికల్లో కూడా హిందూ ముస్లిం చేసే వాళ్ళే గెలిచే పరిస్థితి ఉంది. ముస్లిములు ప్రవేశించకుండా అడ్డుకుంటాం, ముస్లిము లకు ఇళ్ళు అద్దెకు ఇవ్వం, ఇక్కడ నమాజులు చదవరాదు (కాని బహిరంగంగా పూజలు భజనలు, మండపాలు, ట్రాఫిక్ సమస్య లపై ఎవరూ ఎప్పుడు మాట్లాడడం జరగదు), వంటి మాటలు బాహాటంగా చెప్పిన వాళ్ళే రెసిడెన్షియల్ సంక్షేమ సంఘాల్లో గెలుస్తున్నారిప్పుడని తెలుస్తోంది. ఏది ఏమైనా మొత్తం దేశంలో పరిస్థితి మారిపోయింది. ✤


## ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

**ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:**

**1800 572 3000**

ధూళిలో శుభవార్త

అధ్యాయం -8

21

# విచక్షణా ప్రమాణం

ఎస్.ఎమ్. మలిక్

## 1. విజయ పరంపర

మహనీయ అబూ బక్ర్ సిద్దీక్(ర) ఖిలాఫత్ కాలంలో ఇరాక్ పాలకుడు హుర్ముజ్ ఒక పోరులో మహనీయ ఖాలిద్ చేత హతుడయి పోయాడు. అలాగే దూమతుల్ జన్దల్‌లో అకీదర్ పరాజితుడయ్యాడు. ఆ పైన మహనీయ ఖాలిద్, ఖిలాఫత్ కేంద్రం ఆదేశాల మేరకు రోమా, సిరియా వైపునకు వెడుతూ ముస్నా బిన్ హారిసాను తన స్థానంలో నియమించి కొంత సేనను ఆయన వద్ద వదలి పెట్టారు. ముస్నా వద్ద ఉన్న సైన్యం బహు స్వల్పం. ఇస్లామీయ సేనాని తన సేనను బాబిలోనియా నగరం వద్ద మోహరింపజేసి దైవ సహాయం మీద ఆధారపడ్డారు.

## ఇరాక్ కైవసం

ముస్లిమ్ యోధులు ఎనిమిది వేలయితే ఈరాన్ సేనాని, బహ్మన్ జాదూయ వెంట ఉన్న శత్రు సేన యాభై వేలు, ఒకటికి ఆరు నిష్పత్తి! సూర్యోదయం సమయాన పోరు మొదలయింది. అతి తీవ్రమయిన ఘర్షణ తరువాత ముస్లిములు ఆధిక్యత నొందసాగారు. ఈరానీ సేన ఓడి పారిపోతూ ఉండగా వారిని ముస్నా సైనికులు మదాయన్ వరకు తరిమి కొట్టి తిరిగి హీరా వచ్చేశారు. ఈ పోరాటం ఫలితంగా దజ్లానదీ పశ్చిమ తీరాల నుండి పశ్చిమ ఇరాక్ మొత్తం ఇస్లామీయ రాజ్య పరిధిలోకి వచ్చేసింది.

అదే సందర్భంలో ఈరాన్ చక్రవర్తి మృతి వల్ల అక్కడ రాజకీయ సంక్షోభం ఏర్పడి రాచకుటుంబంలో మగ సంతానం లేకపోవడం చేత కూతురు బూరాన్ దుఖ్త్‌ని రాణిగా తఖతు నెక్కించారు అక్కడి సైనికాధికారులు. ఆమె తన కమాండర్లను సమావేశపరిచి ముస్లిముల కెదురుగా పెద్ద ఎత్తున పోరాట సన్నాహాలు చేయవలసిన అవసరాన్ని గురించి తెలిపి ఆ ప్రయత్నాలలో నిమగ్నం చేసింది.

మహనీయ ముస్నా కొంత కాలం కేంద్ర ఆదేశాల కొరకు వేచి చూశారు. ఆదేశాలు రాకపోయే సరికి తన స్థానంలో బషీర్ బిన్ ఖసాసను నియమించి ఖుద్దుగా కేంద్రానికి వచ్చేశారు. అప్పటికి మహనీయ అబూ బక్ర్ ఆరోగ్యం విషమంగా పరిణమించింది. అయినా ఆయన ముస్నాను పిలిచి పరిస్థితులను గురించి విచారించారు. అనంతరం మహనీయ ఉమర్‌కు విషయాలు వివరించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ప్రథమంగా ఇరాక్

మహనీయ అబూ బక్ర్ దివంగతులయిన తరువాత మరుసటి రోజు నుంచి మూడు రోజులపాటు జనుల బయ్త్ గ్రహించడంలోనూ జనుల్ని ముసురుకు వస్తున్న సమస్యల్ని గురించి హెచ్చరించడంలో గడిపారు ఆయన. ఇంకా యోధులు సమాయత్తం కావలసిన అవసరాన్ని గట్టిగా వక్కాణించారు. ఆ సమయంలో యుద్ధ భూమి నుండి వచ్చిన ముస్నా కూడా ప్రసంగించి ఈరానీయుల యుద్ధ పటిమ ఏపాటిదో వివరంగా తెలిపారు.

కడకు అబూ ఉబైద్ బిన్ మస్ఊద్ లేచి, "నేను దానికి సిద్ధం!" అన్నారు. ఆ పైన ఒకరి తరువాత మరొకరు జనం వెళ్ళడానికి ఆమోదం తెలుపసాగారు. ఉమర్, రణరంగంలోకి వెళ్ళడానికి ప్రప్రథమంగా సమ్మతించిన అబూ ఉబైద్ నే, దైవ ప్రవక్త సహచర్యం పొందక పోయినా, ఆయన్నే సేనానిగా నియమించారు. అయితే సైన్యంలో సహచర మాన్యులు ఉండటం మూలాన, వారిని గౌరవించడం, వారి సలహాలను గ్రహించడం అవసరమని కూడా హెచ్చరించారు.

అటు ఈరాన్ మహారాణి బూరాన్ దుఖ్త్ తన సేనకు, పర్షియాకు చెందిన, అనుభవజ్ఞుడయిన ఓ మహా యోధుడు, రుస్తుమ్‌ను సర్వ సైన్యాధిపతిగా నియమించింది. అతను వచ్చీ రాగానే పల్లె ప్రాంతాల్లోని ఇరాక్ ప్రజల్లో ముస్లిముల పట్ల ద్వేషం రేకెత్తించే ప్రయత్నం మొదలెట్టాడు. ఫలితంగా లోగడ వారు ముస్లిములకు మిత్రులయిన వారు, ఇప్పుడు విరోధులయి తిరుగుబాటుకు సన్నద్ధులయ్యారు! అలా ముస్లిములకు లోబడిన ప్రాంతాలు చేజారిపోయాయి.

## నమారిక్ సకాతియ

ఈరాన్ సేనాధిపతి రుస్తుమ్ రెండు బెటాలియన్లు సిద్ధం చేసి, ఒకటి నర్సీ, మరొకటి జాబాన్ నేతృత్వంలో పంపాడు. జాబాన్ తన సేనను నమారిక్ అనే చోట క్యాంపు వేశాడు. ముస్లిమ్ సేనాని అబూ ఉబైద్‌కు విషయం తెలియగానే ఆయన ముందుకు వెళ్లి దాడి జరిపారు. తొలి దెబ్బ తోటే జాబాన్‌ని మట్టి కరిపించారు. అతను పారిపోతూ తన ఈరానీ సిపాయిలకు దూరమయి పోసాగాడు.

ఆ దశలో అతను ఓ ముస్లిమ్ సిపాయీ కంటపడ్డాడు. ముస్లిమ్ సిపాయీని మభ్యపెట్టి, నేనో ముసలివాణ్ణి, నా వల్ల మీకు ఒరిగేదేమీ లేదు. నన్ను వదలి పెట్టి ఇద్దరు బానిస యువకుల్ని బదులుగా తీసుకోమని మోసగించాడు. అతను దాన్ని అంగీకరించి కట్టిన త్రాడు విప్పుతున్నప్పుడు కొందరు సిపాయీల దృష్టి అతనిపై పడి అతన్ని సేనా నాయకుని సమక్షంలోకి తీసుకు వచ్చారు. అతని వంచనా గాధను వినిపించారు. దానికి అబూ ఉబైద్, ఓ ముస్లిమ్ వ్యక్తి అతనికి రక్షణ యిచ్చినప్పుడు నేనెలా దాన్ని భంగపరచ గలను, ప్రమాణ భంగం ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మబద్ధం కాదు అన్నారు.

ఓడిపోయిన ఈ ఈరాన్ సేన నమారిక్ నుండి పలాయనమయి కస్కర్ అనే చోట మరో సేనాపతి ఆధ్వర్యంలో పోరాడటానికి సిద్ధమయింది. అబూ ఉబైద్ కూడా అటు వైపునకు మరలారు. ఈరానీయులు ముస్లిములకెదురుగా బాగా పోరాడ యత్నించారు కాని నిలవలేక పోయారు. వేల కొద్ది క్షతగాత్రులను మృతుల్నీ వదలి పారిపోయారు.

## వంతెన పోరాటం

ఈ పరాజయాల పరంపర వల్ల రుస్తుమ్ ఎటూ తోచని ఒత్తిడికి గురయ్యాడు. బాబిలోనియాలో యాభై వేల సైన్యం ఉన్నా ముస్నా చేతిలో ఓడిపోయిన జనరల్ బహ్మన్ జాదూయ, రుస్తుమ్ వద్దకు కోల్పోయిన శక్తిని పునరుద్ధరించుకోవాలని వచ్చాడు. ఇతను అరబ్బుల పచ్చి శత్రువు. అతనికి రుస్తుమ్ దుర్ఫిష్ కాద్యానీ, అనే శుభప్రదమయిన జెండా ఇచ్చాడు. అది దురవస్థలో ఉన్నప్పుడు శుభాన్ని అనుగ్రహించే ధ్వజం అని నమ్మేవారు ఈరానీయులు. బహ్మన్ ఫరాత్ నదీ తూర్పు తీరంలో వచ్చి మకాం వేశాడు. ముస్లిములు పశ్చిమ తీరాన ఉన్నారు.

బహ్మన్ సందేశం పంపాడు- మీరన్నా నదీ దాటి ఇటు రండి లేదా మమ్మల్ని దాటిరానివ్వండి అని. ముస్నా ఇంకా ఇతర నాయకులు మనం ఇటు ఉండటమే శ్రేయస్కరం అని సలహా ఇచ్చారు. కాని అబూ ఉబైద్ శౌర్య తాపం వల్ల ఉత్తేజితుడయి, "ఈ అగ్ని పూజారులు ముస్లిముల పైన ఆధిక్యత నొందడం ఎలా సాధ్యం?" అని ఆయన పడవల ద్వారా ఓ తాత్కాలిక వంతెన కట్టించారు. యోధులు నది దాటి మర్వహా అనే చోట మకాం వేసి బారులు తీరారు.

ఈరానీ సేన స్వరూపం అత్యంత భయంకరంగా ఉంది. అందులో కదలి వస్తున్న కొండల వలె మహా గజరాజులు మెడల్లో భీకర శబ్దాల గంటలు వేసుకుని వస్తుంటే ముస్లిమ్

యోధుల వైపున ఉన్న అశ్వారూఢుల గుర్రాలు నిలువ లేక పోయాయి. గత్యంతరం లేక సిపాయీలు గుర్రాలు దిగి ఏనుగుల పైన తొట్టెలు కట్టిన త్రాళ్ళు తెగ నరికి సిపాయీలను నేలన పడవేసి హతమార్చారు! వారి నాయకుడు అబూ ఉబైద్ కూడా గుర్రాన్ని వదిలేసి ఓ ఏనుగును గురి పెట్టి అది ముందుకు రాక మునుపే దాని పైకి లంఘించారు. దాని తొండను ఎడతెరిపి లేకుండా కరవాలంతో నరికి ముక్కలు ముక్కలు చేసి వేశారు. ఏనుగు బాధతో భీకరంగా ఘీంకరిస్తూ వెనక్కి మరలి పారిపోసాగింది. ఇతర ఏనుగులు సయితం భయంతో దాని వెనక కాళ్ళకు బుద్ధి చెప్పాయి. అంతటితో ఈరానీ సేనలు చిందువందయి పోయాయి!

ఇదంతా గమనించిన ఈరాన్ కమాండర్, అతని వెంట ఉన్న విలుకాండ్రు అంతా ఓ తెల్లని మదించిన ఏనుగు పై స్వారీ చేస్తూ ముందుకు రాసాగారు. ఆ తెల్ల కొండ రావడం చూసిన అబూ ఉబైద్ గట్టిగా, "అల్లాహు అక్బర్!" అని కేక వేసి పరుగు పరుగున దాని వైపునకు వచ్చి విలుకాండ్రుల బాణం రాక ముందే దాని తొండం పైన దాడి చేశారు. అది తెగి దూరాన పడింది. అంతటితో ఆగక ఆయన దాని కాళ్ళ పైన కరవాలం వేట్లు వేశారు ఏనుగు తాళ లేక పడి పోయింది. పడిపోయిన గజారూఢులు ఒక్కొక్కరే అబూ ఉబైద్ కత్తి వాటుకు శాశ్వత నిద్రకు లోనయ్యారు.

అది ఏనుగుల యుద్ధం. ఆ సంకుల సమరంలో అబూ ఉబైద్ ఓ ఒంటె దెబ్బతో పడిపోయారు. అది ఆయన రొమ్ము పైన కాలు పెట్టి పిండి పిండి చేసివేసింది. ఆయన అమర గతితో విజృంభించి ఈరానీ సేన ముందడుగు వేయసాగింది. ఇది గమనించిన ఓ ముస్లిమ్ యోధుడు పడవల వంతెనకు కట్టిన త్రాళ్ళను తెగ నరికాడు. ఈరానీ సేన ముందడుగును ఆపలేక పోయిన ముస్లిములు వెనక్కి మరలుతూ వంతెన లేకపోవడంతో మూడు వేల మంది సైనికులు ఫరాత్ నదిలో మునిగి పోయారు. అయితే ముస్నా మిగిలిన సైన్యంతో ఈరానీయుల్ని నిలువరించగలిగారు. ఆ మధ్యన వంతెన తిరిగి తయారు చేయించి ఏదో విధంగా మిగిలిన మూడు వేల సైన్యంతో నది దాటగలిగారు.

ఈరానీ సేన 45 వేల మంది. 30 వేల సిపాయీలు, 300 ఏనుగులు బహ్మన్ జాదూయతోనూ, 15 వేల సిపాయీలు జాలినూస్ తోనూ వచ్చిన వారు. వీరికి ఎదురుగా ముస్లిములు మొత్తం తొమ్మిది వేల మంది మాత్రమే. శత్రు సేనలో హతులయిన వారు ఆరు వేలు, క్షతగాత్రులు అంతకన్నా ఎక్కువ. ముస్లిములు అమరగతులు వెయ్యి మంది, మూడు వేల మంది వంతెన లేకపోవడంతో మునిగి పోయిన వారు. రెండు వేల మంది ప్రాణాలు దక్కించుకుని పారిపోయిన వారు. మూడు వేల మంది వంతెన పునర్నిర్మించిన తరువాత సురక్షితంగా వచ్చేసిన వారు.

ఈ వివరాల ద్వారా తేలిపోతుంది, ఎవరు గెలిచారో మరెవరు ఓడిపోయారో!

★★★


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు
Screen Shot పంపి 9989903850 ఫోన్ చేయండి.


**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

‘చరితార్థులు’-2

# మౌలానా షాహ్ అబ్దుల్ రహీం రాయ్‌పూరి

## (1853-1919)



38




**ప్రథమ** స్వాతంత్ర్య సంగ్రామం తరువాత ఆంగ్లేయుల చర్యలు తెచ్చిపెట్టిన దుష్ఫలితాల నేపథ్యంలో మాతృభూమి నుండి ఆంగ్ల పాలకుల తరిమివేత మినహా మరోమార్గం లేదన్న భావన దేశంలో నెలకొంది. ధార్మిక విద్యాలయాలను విముక్తి పోరాటయోధుల స్థావరాలుగా మార్చి స్వాతంత్ర్య సంగ్రామాన్ని పటిష్టం చేయడానికి సాగిన కృషిలో భాగం పంచుకున్న మౌలానా షాహ్ అబ్దుల్ రహీం రాయ్‌పూరి ప్రస్తుత హరియానా రాష్ట్రం అంబాలా జిల్లా తిగరి గ్రామాన 1853లో జన్మించారు. ఆయన తండ్రి అష్రఫ్ అలీ. ప్రాథమిక విద్య తిగరిలో పూర్తి చేసిన అబ్దుల్ రహీం లూధియానా, సహరాన్‌పూర్ తదితర ప్రాంతాలలో 1874 నాటికి ధార్మిక విద్య పూర్తి చేశారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడుతున్న మియా అబ్దుల్ రహీం సహరాన్‌పూరి శిష్యరికంలో సాగిన అబ్దుల్ రహీం రాయ్‌పూరి, తన గురువు ఉపదేశం మేరకు ఆంగ్లేయుల నుండి భారత దేశాన్ని విముక్తం చేయడానికి పూనుకున్నారు. ఆయన ఆలంపురాలో తొలి నివాసం ఏర్పాటు చేసుకుని తన కార్యకలాపాలకు శ్రీకారం చుట్టారు. ఆ తరువాత మక్కాయాత్రకు వెళ్లి అక్కడ ప్రముఖ స్వాతంత్ర్య సంగ్రామ యోధులు మౌలానా ఇందాదుల్లా మహాజిర్ లాంటి ప్రముఖులను కలిసి ప్రేరణతోపాటుగా వారి మార్గదర్శకాన్ని స్వీకరించి మాతృభూమికి విచ్చేసారు. స్వస్థలం చేరుకున్న ఆయన ప్రముఖ స్వాతంత్ర్య సంగ్రామ యోధులు మౌలానా రషీద్ అహ్మద్ గంగోహి, మౌలానా ముహమూదుల్ హసన్ లాంటి ప్రముఖుల కార్యకలాపాలతో మమేకమై ఆంగ్లేయ వ్యతిరేక కార్యక్రమాలను ముమ్మరం చేశారు. బ్రిటిష్ వ్యతిరేక శక్తుల సహకారంతో ఆఫ్ఘనిస్తాన్ నుండి ఆంగ్ల ప్రభుత్వం మీద పోరాటం సాగించాలన్న లక్ష్యంతో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు మౌలానా ముహమూదుల్ హసన్ పరాయి దేశాలకు పయనమైనప్పుడు ఆయన బాధ్యతలను మౌలానా అబ్దుల్ రహీం రాయ్‌పూరి చేపట్టారు. దారుల్ ఉలూం దేవ్‌బంద్ ప్రధాన కార్యస్థానంగా పలు ధార్మిక సంస్థల ఏర్పాటు చేసి ఆ సంస్థలలో విప్లవ కారులను తయారు చేయడం, ఆయా సంస్థలకు ఆర్థిక జవసత్వాలు సమకూర్చడం తోపాటు, ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ప్రజలలో ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. అటు కలకత్తా నుండి కాబూల్ వరకు, ఇటు మద్రాస్ నుండి కరాచీ వరకు విప్లవ కేంద్రాల స్థాపనకు ఆయన నిరంతరం కృషి చేశారు. ఆయా కేంద్రాలలోని విద్యార్థులలో ఆంగ్లేయ వ్యతిరేకత నూరిపోసి మాతృభూమి విముక్తి కోసం పోరుబాట పట్టాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ స్వాతంత్ర్య సంగ్రామ యోధుల తయారీ కార్యక్రమాలను సాగించారు. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో సాగిన బల్కాన్ యుద్ధం సందర్భంగా జాతీయోద్యమకారులు డాక్టర్ ముక్తార్ అహ్మద్ అన్సారి విజ్ఞప్తి మేరకు భారీ ఆర్థిక సహాయం అందించి చరిత్ర సృష్టించారు. ఆంగ్లేయ వ్యతిరేక కార్యకలాపాలను ముమ్మరంగా నిర్వహిస్తూ పరాయి పాలకులకు కంటిలో నలుసులా తయారయిన మౌలానా అబ్దుల్ రహీం రాయ్‌పూరి 1919 జనవరి 29న కన్నుమూశారు. ❑



**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ ‘చరితార్థులు’ - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

# ఆధ్యాత్మిక వికాసమే కాదు అంతర్గత విప్లవం కూడా



- పర్వీన్ సుల్తాన

**పవిత్ర** రమజాన్ మాసం ప్రారంభమైంది. సాధ్యమైనంత ఎక్కువగా ఆధ్యాత్మిక ప్రయోజనాలు పొందడానికి ప్రతి విశ్వాసి ప్రయత్నిస్తున్నాడు.

దేవుడు ఖురాన్‌లో "ఓ విశ్వసించిన ప్రజలారా, మీరు సత్పురుషులుగా మారేందుకు మీ ముందున్న వారిపై విధించిన విధంగానే మీపై ఉపవాసం విధించబడింది" అని నిర్దేశిస్తున్నాడు.

ధర్మాన్ని, భక్తిని, దైవం గురించిన అవగాహనను పెంపొందించే మాసం రమజాన్. మనిషిలో అంతర్గత పరివర్తనను సాధించే ఆధ్యాత్మిక విప్లవం రమజాన్ మాసం.

తమను దేవుడు ఎల్లప్పుడు చూస్తున్నాడనే నిరంతర స్పృహతో మనిషి మసలుకోవడమే ఆధ్యాత్మిక చింతన. ఈ చింతన ఉన్న వ్యక్తి పాపాలు లేదా తప్పులు లేదా దుష్కార్యాలు చేయలేడు. ఇలాంటి ఆధ్యాత్మిక చింతనా విప్లవాన్ని సాధించే మాసం రమజాన్.

పేదల ఆకలి బాధలను సంపన్నులు అనుభవించేలా చేస్తుంది రమజాన్. పేదసాదల పట్ల సానుభూతి పెంచుతుంది. జకాత్ ద్వారా పేదలను ఆదుకునే ఏర్పాటు చేసింది ఇస్లాం.

రమజాన్ మాసం ఆకలితో ఉన్నవారికి అన్నంపెట్టే మాసం. తోటి మానవుల బాధలు తగ్గించడానికి చేయగలిగినదంతా చేసేలా ప్రోత్సహించే మాసం.

రమజాన్ జాగరణలు, ఆరాధనలు, ప్రార్థనలు, దువాల నెల. దేవునితో కనెక్ట్ అవ్వడానికి ప్రయత్నించే నెల. ఉపవాసం జవాబుదారీతనాన్ని పెంచుతుంది.

విలాసవంతమైన ఇఫ్తార్ పార్టీల నెల కాదిది. వ్యక్తిత్వంలో దైవ చింతనను పెంచుకునే తపోనిష్ఠ సాధించుకోవాలి. ఆహారాన్ని వ్యర్థం చేయకుండా ఆకలితో ఉన్నవారందరికీ ఆహారం అందేలా చూడాలి. పరిసరాలను కలుషితం చేయకూడదు. మన చేష్టల వల్ల రమజాన్ ఉద్దేశ్య లక్ష్యాలు దెబ్బ తినరాదు.

### సహరీ సమయంలో ఈ ఆహారం మంచిది కాదు

సహరీ, అనగా రమజాన్ సమయంలో ఉపవాసానికి ముందు ఉదయాన్నే భోజనం చేయడం.

రోజంతా ఏదీ తినకుండా ఉండాలి కాబట్టి ఆహారం విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

సహరీ సమయంలో తీసుకోకూడని ఆహారాలు:

**కాఫీ :** డీహైడ్రేషన్‌కు దారితీయవచ్చు. సహరీ సమయంలో కాఫీ తీసుకోకుండా ఉండడమే మంచిది. చక్కెర కాఫీ బ్లడ్ షుగర్ స్పైక్ కారణమవుతుంది, ఫలితంగా అలసట మరియు ఆకలి ఉంటుంది.

**ఆయిల్ ఫుడ్స్ :** పరాటాలు, నిహారీలు, వేయించిన సమోసాలు, బిర్యానీలు, మిగిలిపోయిన నూనెలతో కూడిన ఆహారాల వల్ల కడుపులో యసిడిటి, గ్యాస్ బాధిస్తాయి. అధిక దాహానికి దారి తీయవచ్చు.

**సాల్టీ ఫుడ్స్ :** ఇన్‌స్టంట్ నూడుల్స్, ప్రాసెస్ చేసిన చీజ్, సాసేజ్‌లు, ఉప్పు ఎక్కువగా ఉండటం వల్ల ఉపవాస సమయంలో గొంతు పొడిబారడానికి, విపరీతమైన దాహానికి కారణమవుతాయి. చక్కెర, ఉప్పు ఎంత తక్కువ తీసుకుంటే అంత మంచిది.

రోజంతా స్థిరమైన శక్తిని అందించడానికి సమతుల్య, పోషకమైన సహరీని తీసుకోవాలి.



- షమీమ్ సుల్తాన

# జీవితం చాలా విలువైనది !

**జీవితం** చాలా విలువైనది... క్షణకాలంలో మారిపోయేది కూడా!... కానీ ఆ మారిపోయే 'క్షణం' మన చేతులారా చేసుకునేది కాకూడదు కదా?

ఏదైనా సంఘటన జరిగినప్పుడు తప్పొప్పులు అటుంచితే మూల్యం చెల్లించాల్సింది మాత్రం మనమే! 'హెల్మెట్ పెట్టుకోండి... సీట్ బెల్ట్ పెట్టుకోండి... మాస్క్ పెట్టుకోండి..' ఈ మాటలన్నీ మన కోసమే, మన రక్షణ కోసమే... అన్న విషయం చాలామంది పట్టించుకోరు. రోడ్డుమీద ట్రాఫిక్ పోలీస్ కనిపిస్తే సందులు గొందులు వెతుక్కుంటూ తప్పించుకునే మనం రోడ్డు మీద తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అకస్మాత్తుగా జరిగే 'ప్రమాదం' నుండి తప్పించుకోలేము. రోడ్డు మీదకు వచ్చామంటే తగిన జాగ్రత్తలు తీసుకోవటం చాలా అవసరం. అవి మన రక్షణ కోసమే అని గ్రహించాలి. జరగకూడనివి జరిగితే మన కోసం ఎదురుచూసే మన కుటుంబం పరిస్థితి ఏమిటీ? రోడ్డు మీద అందరం' నాకేమీ కాదులే' అనుకునే వాహనాల మీద ప్రయాణం చేస్తుంటాం! దురదృష్టవశాత్తు ఎదుటి వాని నిర్లక్ష్యం వలన కూడా ఏమైనా జరిగితే... మనం పాటించే 'ఈ'జాగ్రత్తల వలన మన ప్రాణాలు కాపాడుకునే వాళ్ళమౌతాము.

ఒక ప్రముఖ నటుని ఇంట రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఆ తరువాత వచ్చిన అతని సినిమాల ముందు 'ప్రయాణాల్లో జాగ్రత్త' అని ప్రకటన మనం చూస్తూనే ఉన్నాం! సినిమాల విషయానికొచ్చాం కాబట్టి... పొగ త్రాగకండి...అని ప్రకటన చూస్తుంటాం. నిజంగా ఇవి హాస్యాస్పదంగా ఉండే ప్రకటన. ఎందుకంటే 'పొగ' గురించి నాలుగు, ఐదు సంఘటనలు చెప్పే ఈ 'వ్యవస్థ', 'మద్యం' గురించి ఎందుకు చర్చించటం లేదు?... మద్యం వలన జరిగే పరిణామాలు ఎందుకు చూపించటం లేదు?!

కాబట్టి మన జాగ్రత్తలు మనమే తీసుకోవాలి! ఎవరు మంచి చెప్పినా మన కోసమేనని గుర్తెరిగి ప్రవర్తించాలి! ఇక 'మాస్క్'... 'కరోనా' వలన ఏర్పడిన ఈ 'జాగ్రత్త'... జాగ్రత్త పడేవారిలో ఇప్పుడు ఇది ఒక భాగమైపోయింది. ఇది కరోనా కోసమే కాదు.. ప్రస్తుత 'కాలుష్యం' దృష్ట్యా కూడా సురక్షితమైనది.

ప్రస్తుత పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అన్నీ తీసుకొని... విలువైన మన జీవితాల్ని ఆనందమయం చేద్దాం!

అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ.....

ఎప్పుడో నేను చదివిన ఒక కొటేషన్- 'స్నేహం కోసం ప్రాణాలివ్వడం ఏ మాత్రం కష్టం కాదు... కానీ దానికి అర్హత ఉన్న స్నేహితులు దొరకడమే కష్టం!' అని.. ఈ వాక్యం అప్పటికీ ఇప్పటికీ

ఎప్పటికీ వాస్తవాన్ని చాటే నిత్య సత్యం! మనం మన జీవితంలో చాలా మందిని కలుస్తాం... కొంతమందితో కొన్నాళ్ళు స్నేహం కొనసాగుతుంది... మరికొంత కాలం తరువాత వాళ్ళలో కొందరు మాత్రమే మిగులుతారు. ఈ దూరమయినవాళ్ళు 'ఎందుకు దూరమయ్యారు?' అనే ప్రశ్న వేసుకుంటే 'అవసరం' అనే 'వాస్తవం' బయటపడుతుంది. స్నేహాల్లో కూడా లెక్కలు వేసుకుని, అవసరాలని బేరీజు వేసుకుని కాలం గడిపే మనం... 'ఇది ఎంత వరకు సమంజసం?'' అని ఒక్కసారి ఆలోచిద్దాం! చాలా రోజుల తరువాత కలిసిన మిత్రునితో ''ఏమిటీ మధ్య పలకరించటం లేదు?'' అని పలకరిస్తాం... అదే ప్రశ్న మనకు మనం వేసుకోం! సరే అతను 'నేను చాలా బిజీ' అంటాడు... మనం కూడా అదే సమాధానం ఇస్తాం! రెండూ అబద్ధాలే!... నిజంగా ఒక వ్యక్తిని పలకరించడానికి (ఫోన్లో) కూడా 'టైం' ఉండనంత బిజీగా ఉన్నామా? ఫోన్లు పట్టుకుని ఇటు అటూ తిప్పుకుంటూ గంటల తరబడి వీడియోలు, వాట్సాప్లు చూసుకునే మనకి ఒక పలక రింపుకి టైం ఉండదా?... రోజూ పలకరించాలన్నది నా ఉద్దేశం కాదు గానీ... కనీసం వారానికి ఒక్కసారైనా పలకరించి... యోగ క్షేమాలు తెలుసుకుంటే ఎంత బాగుంటుంది? ఒకప్పుడు ఈ యోగక్షేమాల కోసమే 'ఉత్తరాలు' రాసుకునే వాళ్ళం. పది రోజుల తరువాత మనకి 'జవాబు' జాబు వచ్చేది. ఎంత బాగుండేది? మరి ఇప్పుడు ఒక్క నిముషంలో జరిగిపోయేదాన్ని ఎందుకు విస్మరిస్తున్నాం!... అందర్నీ పలకరిద్దాం!... స్నేహాల్ని కాపాడు కుందాం... మనకు 'ఇంత'మంది ఆప్తులున్నారని గర్వ పడదాం! స్నేహితుల కోసం ప్రాణాలు ఇవ్వక పోయినా... ప్రాణ స్నేహితులు అనుకునే నలుగురితో స్నేహం కొనసాగిద్దాం! అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ.....

## కాసే చెట్లకే రాళ్ళ దెబ్బలు!

మనం తరచూ వినే సామేత! ఈ సామెతని అన్వయించుకుంటే సరిగ్గా సరిపోతుంది. మనం పది పనులు చేసినప్పుడు అందులో ఒకటి పొరపాటున తప్పయిందనుకోండి... ఇక అంతే! సరిగ్గా చేసిన తొమ్మిది పనులు వదిలేసి, ఆ 'ఒక్క' తప్పునే ఎత్తి చూపుతూ నానా రభస చేస్తారు. చాలామందికి ఈ 'గుణం' ఉంటుంది. ఎదుటి వాళ్ళలో తప్పులు ఎత్తి చూపడమే తమ నైజంగా ప్రవర్తిస్తుంటారు. వీరి ముఖ్యోద్దేశం ఎదుటివాళ్ళ గొప్పతనం అంగీకరించలేకపోవడమే! ఉదాహరణకి మనం ఒక గొప్ప వ్యక్తి గురించి చెప్పామనుకోండి... 'ఆఁ అవును నాకతను తెలుసు.. ఎప్పుడూ ఆడవాళ్ళని అదోలా చూస్తుంటాడు. వట్టి వెధవ!' అని పుసుక్కున అనేస్తారు... ఒక్క 'అతనే' మహా మనిషిలా ఫీలైపోతూ! మనం ఏం చేసినా అందులో వంకలు వెతకటమే వీరి జీవితాశయంగా ఉంటుంది. మళ్ళీ తప్పు అని చెప్పే వీళ్ళకి రైట్ ఏమిటో తెలియదు. ఎలా చేయాలో తెలియదు. ఎదుటి వాళ్ళని తక్కువ చేయడమే వీరి మానసిక స్థితి. ఇంతకీ చెప్పొచ్చే దేమిటంటే ఇలాంటి వాళ్ళ మాటలు విని మనం బాధ పడాల్సిన అవసరం లేదు. మనం 'ఆ' పనిని ఎంత 'సిన్సియర్ గా చేసామో గుర్తెరిగి, అలాంటి 'పొరపాట్లు' మళ్ళీ జరగకుండా జాగ్రత్త పడటమే మన కర్తవ్యం! ఎవరు ఎలాంటి వాళ్ళో... విమర్శలు చేస్తున్న వారి ఉద్దేశం ఏమిటో కాస్త లౌక్యంగా కనిపెట్టగలిగి, వారిని దూరంగా పెట్టగలిగితే మన 'పనులు' ప్రశాంతంగా, ఉత్సాహంగా చేయగలుగుతాం!

## Experience is the best master...

ఇది ఓ ఆంగ్ల సామెత! మన ముందుతరం వారి అనుభవాలు మనకి చాలా విషయాల్లో మార్గదర్శకం అవుతాయనేది సత్యం. అయితే సమస్యల్లా పెద్దవాళ్ళను మనం అడగం... వాళ్ళేమో అడగకుండా చెప్పటం ఏమిటని చెప్పరు. పొరపాట్లు, తప్పులూ చేసుకుపోతుంటాం. అందరికీ అన్ని విషయాలు తెలియవు. తెలిసిన వాళ్ళను అడిగి తెలుసుకోవటం తప్పు కాదు! ఏ పనులకు పర్యవసానం ఎలా ఉంటుందనేది అనుభవంతో తెలుసుకున్న వారి సూచనలు మనకెంతో దోహదపడతాయి.

ఉదాహరణకి ఒక ఆఫీసులో కొత్తగా చేరిన ఆఫీసర్ కంటే ఒక సీనియర్ క్లర్క్ గొప్పగా పనులు చేయగలడు... ఏం చేయాలో, ఎలా చేయాలో చెప్పగలడు. అది అనుభవం వలన వచ్చిన నైపుణ్యం. ఒక ఇంటి పెద్ద సలహాలు తీసుకుంటే మనం చేసే పనులు చాలా సులువుగా, తొందరగా అయిపోతాయి. అలా చేయటం వలన బంధాలు కూడా బలపడతాయి.

కష్టపడి పనులు చేయడం కాదు... సులువుగా చేయటం ముఖ్యం. ప్రస్తుతం మనం 'టెక్నాలజీ' బానిసలం. 'కంప్యూటర్' సలహాలతో చాలా పనులు చేస్తున్నాం. అయితే కొన్ని కుదరవు! వాటిని గుడ్డిగా చేసేయకుండా వాటి గురించి మన 'పెద్ద'లను సంప్రదించి చేయగలిగితే కచ్చితంగా దాని ఫలితం బాగుంటుందనేది నిజం!

**మిగతా 17వ పేజీలో...**



# వరాల మాసం... శుభాల మాసం... రమజాన్

- పోలంకి విజయభాస్కర్

**హితబోధలు,** సూక్తులు, ఉపదేశాలు విన్నంత మాత్రాన ఉపయో గమేముంది? వాటిని ఆలకించాలి.. ఆచరించాలి. అప్పుడే సత్య ధర్మానికి సంబంధించిన సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది. ఈ అవగాహన ఇస్తున్న పవిత్ర రమజాన్ మాసానికి స్వాగతం, సుస్వాగతం.

ఇస్లాం క్యాలెండర్ ప్రకారం రమజాన్ నెలవంక కనబడగానే వేకువజాము నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభమవుతాయి. ఇలా 29 దినాలు లేదంటే 30 దినాల తర్వాత నెలవంక కనబడడంతో దీక్ష విరమణ చేస్తారు. రోజా పాటించాలనుకునే వారు ఉషోదయానికి ముందే అంటే తెల్లవారుజామునే అన్నపానీయాలు సేవించాలి. దీన్నే 'సహరీ' అంటారు. తరువాత సూర్యాస్తమయం వరకు పచ్చి మంచినీళ్లు కూడా ముట్టకూడదు. సూర్యాస్తమయం కాగానే రోజా విరమించాలి. దీన్ని ఇఫ్తార్ అంటారు. అబద్ధాలు, చాడీలు, అపనిందలు, అసభ్య పదజాల ప్రయోగం అన్నివేళలా అధర్మం, నిషిద్ధమని గ్రహించాలి. ఆకలి అంటే ఏమిటో తెలియని ఆగర్భ శ్రీమంతులకు సైతం ఆ బాధను అనుభవపూర్వకంగా తెలియజేసేదే రమజాన్ ఉపవాసం.

ఉపవాసం ఇతర ఆరాధనలకంటే భిన్నమైనది. నమాజ్‌లో కూర్చోవడం, నిల్చోవడం, రుకూలు, సజ్దాలు చేస్తారు. దీనిని ప్రతి వ్యక్తి చూడగలడు. జకాత్ (దానం) విషయం కనీసం దానిని తీసుకునే వ్యక్తికైనా తెలిసిపోతుంది. హజ్ విధిని లక్షల మంది ఎదుట నిర్వహిస్తాడు. కానీ ఉపవాసమనేది దేవుడికి- దాసుడికి మధ్యనే ఉంటుంది. మూడో వ్యక్తికి తెలియదు. ఉపవాసం కేవలం నా కోసం మాత్రమే పాటించబడుతుంది. నేను దానికి పూర్తి ప్రతిఫలం ప్రసాదిస్తానని దేవుడే తెలియజేశాడు. నెల రోజుల కఠోర దీక్షలతో నీరసించిన శరీరం, వాడిన ముఖాలతో ఆనందం, ఏదో సాధించామనే సంతృప్తి కనబడుతుంది. సృష్టికర్త ఆదేశాలను పాటించినందుకు చేసిన వారి శ్రమకు పరిపూర్ణ ప్రతిఫలం, బహుమానమే ఈ రమజాన్ పండుగ.

అంతిమ దైవగ్రంథం దివ్య ఖుర్ఆన్ ఈ రమజాన్ మాసంలోనే

అవతరించింది. ఈ గ్రంథం కేవలం ముస్లిముల కోసమే ఉద్దేశించినది కాదు. సమస్త మానవాళి శ్రేయం, పరమ లక్ష్యంగా ఇది వెలిసింది. రమజాన్ మాసమంతా ఈ పవిత్ర గ్రంథ పారాయణం జరుగుతుంది. దైవ ప్రేమ పొందడానికి కావలసిన అత్యున్నత భావాల్ని రమజాన్ మాసంలో ఖుర్ఆన్ పఠనం వల్ల గ్రహిస్తారు. మానవ సహజ బలహీనతల వల్ల జరిగిన తప్పుల్ని తెలుసుకుని పశ్చాత్తాపంతో దైవం వైపునకు మరలుతారు. సత్కార్యాల్లో లీనమవుతారు. దైవభీతితో హృదయం కంపించిపోవాలి. ఈ విధంగా దైవానికి దగ్గర కావడానికి, సత్కార్యాల్లో ఇతోధికంగా పాలుపంచుకోవడానికి ఈ పవిత్ర రమజాన్‌కు మించిన అవకాశం మరొకటి లేదనే చెప్పవచ్చు.

రమజాన్ నెల చివరి పది రోజుల్లో వేయి నెలల కన్నా విలువైన ఒక మహా రాత్రి ఉంది. ఏతెకాఫ్ అనే ప్రత్యేక ఆరాధన కూడా ఈ చివరి పది రోజుల్లోనే ఆచరిస్తారు. దైవప్రవక్త(స) రమజాన్‌నెల చివరి పది రోజుల్లో దైవారాధనలో పూర్తిగా నిమగ్నం అవడమేగాక తన సహచరులను, ఇంటి వారిని కూడా ప్రోత్సహించేవారు. ఆయన(స) రమజాన్ చివరి వారంలో చేసినన్ని విస్తృత ఆరాధనలు, మరే నెలలోనూ చేసేవారు కాదని హజ్రత్ ఆయిషా(రజి) తెలిపారు. మానవ జాతికి రుజుమార్గం చూపి, వారి ఇహపర సాఫల్యానికి కేంద్రబిందువుగా నిలిచే మహత్తర గ్రంథం ఖుర్ఆన్. రమజాన్ నెలలో ప్రత్యేకించి చివరి భాగంలోని లైలతుల్ ఖద్ర్. షబెఖద్ర్‌లో అవతరించింది కాబట్టే ఈ ఒక్క రాత్రి చేసే ఆరాధనలు వెయ్యి నెలలకన్నా ఎక్కువగా చేసిన ఆరాధనలతో సమానమన్నారు.

పండుగ రోజు ముస్లింలు స్నానాదులు పూర్తిచేసి కొత్త దుస్తులు ధరించి ఈద్గాహ్‌లో నమాజ్ పూర్తయ్యాక అక్కడ సమావేశమైన వారిలో వీలైనంత ఎక్కువ మందిని కలిసి సుహృద్భావంతో చేతులు కలుపుతారు.

ఈద్ ముబారక్ (పండుగ శుభాకాంక్షలు) తెలియజేసుకుంటారు. ముస్లిమేతర సోదరుల్ని సాదరంగా ఇంటికి ఆహ్వానించి విందులారగిస్తారు. ఇవన్నీ మత సామరస్యానికి ప్రతీకలు. ఈద్ మిలాప్ సమావేశాలు పరస్పర సదవగాహనకు చెరగని చిహ్నాలు. సమైక్యతకు, ధర్మనిరతికి తార్కాణాలు. ❖

15వ పేజీ తరువాయి...

అనుభవజ్ఞుల సలహాలు, సూచనలు తీసుకుని మనం చేయబోయే పనులు విజయవంతంగా పూర్తి చేద్దాం!

## కలసి వుంటే కలదు సుఖం

సుఖం అన్నదానినే అందరం ఇష్టపడు తున్నాం... దాని కోసం పరుగెడుతున్నాం... కానీ ఆ 'కలసి' వుంటే అన్న ప్రక్రియని విస్మరిస్తున్నాం. ముఖ్యంగా అభిప్రాయ భేదాలతో ఈ మధ్య మనుషులు దూరం కావటం బాధాకరం. అభిప్రాయ భేదాలు ఉండటం అంటే శతృత్వం పెంచుకోవటం కాదు! ఒక అంశం మీద ఒకొక్కరికీ ఒకో అభిప్రాయం ఉంటుంది. ఆ అభిప్రాయాల్ని వీలుంటే గౌరవిద్దాం! నచ్చకపోతే వదిలేద్దాం! అంతేగానీ మన అభిప్రాయాలు వాళ్ళ మీద రుద్దీ... నానా రభస చేసి, తోటివారిని దూరం చేసుకోవద్దు! ఇప్పుడు అందరూ 'నాదీ'... 'నేను' అనే చట్రంలో ఇరుక్కుని బతుకుతున్నాం. ఉన్న ఆ 'కాస్త' బంధాలు, స్నేహాలు...చేతులారా మన మాటే నెగ్గాలనే కారణంగా... నా అభిప్రాయమే కరెక్ట్ అన్న అహంతో తెంచుకుంటు న్నా మేమో ఒక్కసారి ఆలోచిద్దాం! ఒకవేళ ఏదైన ఒక విషయమై ''అయిన వాళ్ళతో'' వాదనలు పెట్టుకుంటే మాత్రం ఎదుటివాళ్ళ మనోభావాలు దెబ్బ తినకుండా, మన అభిప్రాయాలు చెప్పాలి! అలానే ఎదుటివారి అభిప్రాయాలు వినాలి! అంతేగానీ అభిప్రాయాలు కలవలేదని వారిని ద్వేషించటం... శతృత్వం పెంచు కోవటం అర్థం లేని చర్యలు! మనల్ని మనం నియంత్రించుకోలేనప్పుడు... ఏదైనా విషయంపై భేదాభిప్రాయాలు ఉంటే... ఆ చర్చకు దూరంగా ఉండటమే శ్రేష్టం! ఎదుటివారి మనోభావాలను గౌరవిస్తూ... మన మాటలతో వారిని బాధపెట్టకుండా ఉండే చర్చలు శ్రేయోదాయకాలు!

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

53 ఆయత్‌లు

# 42. అష్ షూరా

మక్కా అవతరణ

51 – 53 ఒకరితో, అల్లాహ్ ముఖాముఖీగా మాట్లాడటానికి ఏ మనిషి స్థానమూ తగదు. ఆయన సంభాషణ వహీ (సంజ్ఞ) తీరులోనో, లేదా తెరచాటుగానో జరుగుతుంది. లేదా ఆయన ఒక సందేశవాహకుని (దైవదూతను) పంపిస్తాడు, ఆయన ఆదేశం మేరకు ఆయన కోరిన దానిని అతను వహీ చేస్తాడు, ఆయన ఉన్నతుడూ విజ్ఞుడు కూడా. మరి ఇదేవిధంగా (ముహమ్మద్!) మేము మా ఆదేశం మేరకు ఒక ఆత్మను నీ వద్దకు వహీ చేశాము.[83] నీకు గ్రంథం ఏమిటో, విశ్వాసం ఏమిటో ఏమీ తెలియదు,[84] కాని మేము ఆ ఆత్మను ఒక కాంతిగా చేశాము, దాని ద్వారా మార్గం చూపిస్తాము మా దాసులలో మేము కోరినవారికి. నిస్సందేహంగా నీవు రుజుమార్గం వైపునకు దారి చూపిస్తున్నావు, ఆ దేవుని మార్గం వైపునకు, ఆయన భూమీ ఆకాశాలలోని ప్రతి వస్తువుకు స్వామి. బాగా గుర్తుంచుకో, సకల వ్యవహారాలూ అల్లాహ్ వైపునకే మరలుతాయి.[85]

**(83వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

ఇంతేకాక అనేక హదీసుల్లో ప్రవక్త మహనీయులు (స) 'నా మనసులో ఫలానా మాట వేయడం జరిగింది, నాకు ఫలానా విషయం తెలుపడం జరిగింది, నాకు ఈ ఆదేశమయింది, నన్ను దీన్ని గురించి వారించడం జరిగింది' అని పలికినట్లు ఉదాహరణలున్నాయి. ఇటువంటివన్నీ మొదటి కోవకు చెందిన "వహీ" లన్నమాట. 'హదీసు కుద్సీ' కూడా ఈ కోవకు చెందినదే.

(2) మేరాజ్ సందర్భంలో రెండవ రకానికి చెందిన 'వహీ' పొందే భాగ్యం ప్రవక్తశ్రీ (స)కి కలిగింది. అనేక ప్రామాణిక హదీసుల ద్వారా, ఆ సందర్భంలో ప్రవక్తశ్రీ (స)కి అయిదు వేళల నమాజ్ ఆదేశమివ్వడం, దానికి ప్రవక్తశ్రీ (స) మాటి మాటికీ మనవి చేసుకున్న ప్రస్తావన వచ్చింది. ఈ విధానాన్ని బట్టి స్పష్టంగా తెలిసేదేమిటంటే, ఆ సందర్భంలో అల్లాహ్, ఆయన దాసుడు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్)కు మధ్యన జరిగిన సంభాషణ తూర్ కొండ అడుగున హజ్రత్ మూసా (అ), పరమ ప్రభువు అల్లాహ్‌కు మధ్యన జరిగినదానికి పోలినదే.

(3) పోతే, మూడవ కోవకు చెందిన వహీ విషయంలోనయితే దివ్య ఖుర్‌ఆన్ స్వయంగానే సాక్ష్యం పలుకుతోంది– ఖుర్‌ఆన్‌ని దైవదూత జిబ్రీల్ అమీన్ ద్వారా దైవ సందేశ హరుల (స) వద్దకు అందజేయడం జరిగిందని *(అల్ బకర:97 అష్ షుఅరా: 192–195).*

84. అంటే, దైవదౌత్యంపైన నియుక్తులవడానికి పూర్వం ఎన్నడూ ప్రవక్తశ్రీ(స) మనసులో తనకు ఒక గ్రంథం ప్రాప్తం కానున్నదనే, లేదా ప్రాప్తం కావలసి ఉందనే ఊహ కూడా కలగలేదు. నిజానికి అసలు ఆయనకు దైవగ్రంథాలను గురించిగానీ, వాటిలో వచ్చే విషయాలను గురించిగాని ఏమీ తెలియదు. అదే విధంగా ఆయనకు అల్లాహ్ పట్ల విశ్వాస మయితే ఉండేది, కాని చేతన స్థాయిలో, దాని వివరాలను గురించి ఆయన ఏమీ ఎరుగరు. మానవుడు అల్లాహ్ విషయంలో ఏ ఏ విషయాలు నమ్మాలి అన్న విషయం ఆయనకు తెలియనే తెలియదు. దీనితో పాటు దైవదూతలు, దైవదౌత్యం, దైవగ్రంథాలు, పరలోకం పట్ల కూడా అనేక విషయాలు నమ్మవలసి ఉంటుందని కూడా ఆయన ఎరుగరు. ప్రవక్తశ్రీ (స)ని గురించి ఈ రెండు వాస్తవాలు మక్కా తిరస్కారులు సయితం ఎరుగనివి కావు. మక్కా పుణ్యపురిలోని ఏ వ్యక్తి అయినాసరే, దైవదౌత్య ప్రకటనకు పూర్వం, ఎన్నడయినా ప్రవక్తశ్రీ (స) నోట దైవగ్రంథం ప్రస్తావన విన్నట్టు, జనులు ఫలానా ఫలానా విషయాలను నమ్మవలసి ఉంటుందని ఆయన ద్వారా విన్నట్టు సాక్ష్యం ఇవ్వలేదు. ఒక వ్యక్తి ముందు నుంచే ప్రవక్త కావాలని సన్నద్ధుడవుతూ ఉంటే అతను నలభయ్యేళ్ళ వరకు అతనితో పాటు రేయింబవళ్ళు కలిసి మెలిసి జీవించినవారు ఎన్నడయినా అతనినోట గ్రంథం, విశ్వాసం వంటి పదాలను సయితం వినకుండా ఉండటం, ఆ తరువాత, నలభయ్యేళ్ళ పిదప అకస్మాత్తుగా అతను ఈ విషయాలపైనే అనర్గళంగా ప్రసంగాలు చెయ్యడం అన్నది ఎన్నటికీ సంభవించదు.

85. ఇది తిరస్కారులకు ఇచ్చిన కడపటి హెచ్చరిక. దీని భావమేమిటంటే ప్రవక్త మీకు చెప్పడం, మీరు దాన్ని విని తిరస్కరించడం – విషయం ఇంతటితో ముగియకూడదు. ప్రపంచంలో జరిగేది ఏదయినా అంతా అల్లాహ్ సన్నిధిలో హాజరుపరచబడనున్నది. చివరికి ఎవరి పరిణామం ఏది కాగలగాలో ఆయన దర్బారులోనే తీర్పు జరగనున్నది.

**(సమాప్తం)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

అధ్యాయం : 33

## అన్సార్ల[1] గొప్పతనం గురించి...

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు : శరణార్థుల రాకకు పూర్వమే, విశ్వసించి వలస కేంద్రంలో స్థిరపడిన వారికి కూడా (ఈ ఆస్తులలో) హక్కు ఉంది. వారు తమ వద్దకు వలస వచ్చిన వారిని ప్రేమిస్తారు. వారికి ఏది ఇవ్వబడినా, దాని అవసరం సయితం ఉన్నట్లుగా వారు తమ మనస్సులలో భావించరు.[2] వారు స్వయంగా అగత్యం కలవారైనప్పటికీ, తమకంటే ఇతరులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. *(అల్ హష్ర్ : 9)*

**412)** గీలాన్ బిన్ జరీర్ తెలిపారు: నేను మహనీయ అనస్(రజి)ను, "చెప్పండి, అన్సార్ అనే పేరును మీరు స్వయంగా పెట్టుకున్నారా? లేక మీకు ఈ పేరు అల్లాహ్ పెట్టాడా?" అని నేను అడగ్గా, "ఈ పేరు మేము పెట్టుకున్నది కాదు, అల్లాహ్‌యే మాకు ఈ నామకరణం చేశాడు" అని ఆయన చెప్పారు. గీలాన్ ఉల్లేఖనంలో ఈ విధంగా కూడా ఉంది: మేము అనస్(రజి) సేవలో హాజరయ్యే వారం. ఆయన మాకు, అన్సార్ల గొప్పతనం గురించి, ధర్మయుద్ధాలలో వారు కనబరచిన అసాధారణ పోరాట పటిమ గురించి విడమరచి చెప్పేవారు. తరువాత ఆయన నా వైపు లేదా అజ్ద్[1] తెగకు చెందిన ఒక వ్యక్తి వైపు తిరిగి, "మీ జాతి వారు (అన్సార్) ఫలానా రోజున ఫలానా ఘనకార్యం సాధించార"ని చెప్పేవారు.

**413)** హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం : (ఇస్లామ్‌కు పూర్వం ఔస్– ఖజ్రజ్ తెగల మధ్యన జరిగిన) బుఆస్ యుద్ధాన్ని అల్లాహ్ తన ప్రవక్త(సఅసమ్) మదీనాకు రాకపూర్వమే సమాప్తం అయ్యేలా చేశాడు. ఆయన(స) మదీనాకు వచ్చినప్పుడు ఈ తెగల వారు పరస్పరం అనైక్యతకు గురై ఉన్నారు. వారి నాయకులలో కొందరు వధించబడగా, మరికొందరు క్షతగాత్రులై ఉన్నారు. దైవప్రవక్త (మదీనాకు) రాక పూర్వమే ఈ యుద్ధ విరమణ జరగటంతో, ఆయన(స) రాగానే వారు ముస్లింలుగా ధర్మపరివర్తన చెందారు.[1]

33-1. 'నాసిర్' అనే పదానికి బహువచనం 'అన్సార్'. అన్సార్ అంటే సహాయకులు అని అర్థం. మదీనాలో నివసించే ఔస్, ఖజ్రజ్ తెగలకు చెందిన ముస్లింలకు లభించిన బిరుదు అన్సార్. వారు దైవప్రవక్త(స)కు రక్షణ కల్పించడమేగాక, ధన ప్రాణాలతో ఆదుకున్నారు.

33-2. మక్కా నుండి హిజ్రత్ చేసి మదీనాకు వచ్చిన ముహాజిర్ ముస్లింలకు అన్ని విధాలా తోడ్పాటునందించారు. వారి పునరావాసం నిమిత్తం దైవప్రవక్త(స) వారికి సహాయం చేసినప్పుడు అన్సార్లు దానిని హృదయపూర్వకంగా స్వాగతించారు.

412-1. 'అజ్ద్' అనేది యమన్ ప్రాంతంలోని ఒక తెగ. అన్సార్లంతా ఆ తెగ సంతానమే.

413-1. మదీనా నగరానికి రెండు మైళ్ళ దూరాన ఉన్న ఒక స్థలం పేరు 'బుఆస్'. అక్కడ అన్సార్ల రెండు తెగల (ఔస్-ఖజ్రజ్) మధ్యన భీకర పోరాటం జరిగింది. ఇరు తెగల నాయకులు ఆ యుద్ధంలో వధించబడ్డారు. హిజ్రత్‌కు ఐదారేళ్ళ క్రితం ఈ యుద్ధం ముగిసింది. కాని ఇరుతెగల వారి మనసులు వేర్వేరుగా ఉండేవి. ఇస్లామ్ చలువ వల్ల వారి మధ్యన ప్రేమానురాగాలు పెంపొందాయి. సోదర భావన బలపడింది. పూర్వం ఒకప్పుడు పరస్పరం బద్ధ శత్రువులుగా ఉండే ఈ ప్రజలు ఇస్లామ్ తరువాత పరస్పరం సంగరితమై సరికొత్త చరిత్ర సృష్టించారు.

★ ★ ★




మూలం: మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహి (రహ్మ)

అనువాదం: ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

**తౌహీద్ కేవలం ఒక శాస్త్రీయ యథార్థం కాదు, పైగా అది అత్యంత ముఖ్యమైన క్రియాత్మక యథార్థం. మానవ జీవితంపై- అది వ్యక్తిగతమైనదైనా, సామూహికమైనదైనా- దానివల్ల పడే ప్రభావాలు లోతైనవి. వాటిలో కొన్నింటిని ఇక్కడ ప్రస్తావించదలిచాము.**

వ్యక్తిగత జీవితంపై తౌహీద్ వల్ల పడే ప్రభావం ఎటువంటి దంటే ఈ నమ్మకం (అఖీదా) మనిషిని స్వేచ్ఛా స్వాతంత్ర్యాల శిఖరాగ్రానికి చేరుస్తుంది. మానవుడు సృష్టి శ్రేష్ఠుడైన కారణంగా ఈ స్వేచ్ఛకు, ఆత్మ గౌరవానికి అతను హక్కుదారుడు. ఈ విశ్వమంతా మానవుని కోసమే సృష్టించబడింది. కాని మానవుడు దేవుని ఏకత్వాన్ని ఆశ్రయించనంతవరకు అతడు దీనావస్థలోనే ఉంటాడు. అతడు ప్రపంచంలోని అల్పమైన వస్తువులకు కూడా భయపడిపోతాడు. గజగజా వణికిపోతుంటాడు. ఏ వస్తువులు అతనికి లోబడి ఉండటానికి, అతనికి విధేయత చూపటానికి పుట్టించబడ్డాయో వాటికి తానే స్వయంగా లొంగిపోతాడు. వాటికి విధేయత చూపుతాడు. తన లాంటి మనుషులనే తన ప్రభువుగా, యజమానిగా చేసుకుని వారి ముందు బానిసలా తల వంచుతాడు. వారినే అన్నదాతలుగా, వరప్రదాతలుగా, పేదల పరిపోషకులుగా- బిరుదులిచ్చి- సంబోధిస్తాడు. వారికి ఆజ్ఞాపించే, శాసించే హక్కు ఉందని అంగీకరిస్తాడు. కడకు బ్రతికి ఉన్న వారి ముందరే కాకుండా మృతుల సమాధులపై కూడా దరఖాస్తులను, విజ్ఞాపనా పత్రాలను సమర్పించుకుంటాడు. వారిని జగతి నిర్వహణలో భాగస్తులుగా, లాభనష్టాలు చేకూర్చేవారిగా భావిస్తాడు. ఆఖరికి ప్రతి నున్నని రాతి గుండును, ఎత్తయిన ప్రతి చెట్టు పుట్టను దైవంగా చేసుకుంటాడు. ఆఖరికి ప్రతి దట్టమైన అడవి, ప్రతి నిర్మానుష్యమైన ప్రదేశం, ప్రతి ప్రవహించే నది, ప్రతి హానికరమైన శక్తి, ప్రతి లాభదాయకమైన వస్తువు అతనిని తన దాస్యం కోసం పిలుపునిస్తుంది. వాటిలో ఏ ఒక్కదాని ముందు కూడా తన అంతరాత్మను వంచించుకోవడానికి అతను సంకోచించడు. అతనిలోని పౌరుషం నీరుగారిపోతుంది. ఒకసారి అతను తన గౌరవ స్థానం నుండి పడిపోయాడంటే, ఇక అతను పడిపోతూనే ఉంటాడు. అతనికి అల్లాహ్ ఏ ఔన్నత్యాన్ని ప్రసాదించాడో దానిని ఒక్కసారిగా పోగొట్టుకుంటాడు. సూరయె హజ్జ్‌లోని క్రింది ఆయత్‌లో ఈ విషయమే ఇలా చెప్పబడింది:

**“ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవాడు ఆకాశం**

**నుండి క్రిందపడిపోయినట్లే. అతనిని, ఇక పక్షులైనా తన్నుకు పోతాయి లేదా గాలి అతనిని ముక్కలు ముక్కలయ్యే ప్రదేశానికైనా విసిరివేస్తుంది." (అల్ హజ్జ్- 31)**

అల్లాహ్ ఏ ఏ వస్తువులను మానవ సేవలో నియోగించాడో అవి అతని సేవలో నిమగ్నమై ఉన్నప్పటికీ, అతనికి సాష్టాంగ ప్రణామం (సజ్దా) చేయడానికి ఒక్క క్షణకాలం కూడా సహించవు. వాటి సాష్టాంగ ప్రణామం అల్లాహ్‌కే ప్రత్యేకం. కాని ఈ మానవుడే మరీ అన్యాయం. అతని దీనావస్థ గురించి ఏం చెప్పేది!? అతని నుదుటిపై గడప గడప వద్ద సాష్టాంగ పడిన గుర్తులున్నాయి.

**"ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న సమస్తమూ, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, పర్వతాలు, వృక్షాలు, జంతువులు, చాలామంది మానవులు, శిక్షకు అర్హులైన చాలామంది ప్రజలు అల్లాహ్ ముందు వినమ్రులై ఉండటాన్ని నీవు చూడటం లేదా? అల్లాహ్ ఎవరినైతే అవమానంపాలు చేస్తాడో, ఇక అతనికి గౌరవం ఇచ్చేవాడెవ్వడూ ఉండడు. అల్లాహ్ తాను కోరిన దానిని చేస్తాడు." (అల్ హజ్జ్- 18)**

కాని తౌహీద్ (ఏకేశ్వరోపాసన) మెరుపు ప్రాప్తమవగానే ఒక్క సారిగా అతని పరిస్థితిలో విప్లవాత్మకమైన మార్పు వచ్చేస్తుంది. ఈ ప్రపంచంలోని ప్రతి వస్తువు కన్నా అట్టడుగు స్థానంలో ఉన్న మనిషిని మనం ఇందాక చూశాము. ఇప్పుడతను ఎంతటి ఉన్నత స్థానానికి చేరుకుంటాడంటే ఆ ఏకైక దేవుడు తప్ప ప్రతి వస్తువు అతని క్రిందికి వచ్చేస్తుంది. ఈ పరివర్తనకు సంబంధించిన అత్యుత్తమ ఉపమానం మనకు మహనీయ మూసా (అ)- ఆయనకు ఎదురుగా ఉన్న మంత్రగాళ్ళ గాథలో దొరుకుతుంది. ఏ మంత్రగాళ్ళను ఫిరౌన్ సమీకరించాడో, కొద్దిసేపటి క్రితం వారి దీనావస్థ ఎలా ఉందంటే, పోటీ కోసం రంగంలోకి రాకముందు తమకు లభించవలసిన వేతనం కోసం రాజుగారి నుండి హామీ పొందగోరారు. తమకు ముట్ట వలసిన పారితోషికం కోసం ఎంతో దయనీయ స్థితిలో ఇలా విన్నవించుకున్నారు: **(మహా ప్రభో!) ఒకవేళ మేము గెలిస్తే మాకు దీని ప్రతిఫలం తప్పకుండా లభిస్తుంది కదా!" (7: 114).**

కాని ఎక్కువ సమయం గడవలేదు. తౌహీద్ యొక్క ఒక ఛాయ వారి మీద పడగానే, వారి స్వభావంలో అనూహ్యమైన గొప్ప పరివర్తన వచ్చేసింది. వారు నిజదైవాన్ని విశ్వసించి నందుకు కఠినాతికఠినంగా శిక్షిస్తానని ఫిరౌన్ బెదిరించాడు. 'మీ కాళ్ళు చేతుల్ని నరికి మిమ్మల్ని ఉరికంబంపైకి ఎక్కిస్తా న'ని అంటాడు. కాని ఈ బెదిరింపు ప్రభావం వారిపై ఎంత మాత్రం పడలేదు. వారు ఎలాంటి జంకు లేకుండా- నిర్భ యంగా- ఇలా జవాబిచ్చారు: "మరేమీ ఫరవాలేదు. ఎట్టి పరిస్థితిలోనూ మేము మరలవలసింది మా ప్రభువు వద్దకే. నీకు చేతనయింది చేసుకో. నీ జోరు ఈ ప్రపంచ జీవితం వరకే నడుస్తుంది." (అల్ ఆరాఫ్ 125వ వచనం ఆధారంగా).

ఇలా ఎందుకు? ఎందుకంటే, సుఖమైనా దుఃఖమైనా, జీవి తమైనా మరణమైనా, ప్రతిదీ వచ్చే పోయే మార్గం ఒక్కటేనన్న పరమ రహస్యం ఏకేశ్వరోపాసకునికి తెలిసిపోయింది. అందుకే అతను సర్వకాల సర్వావస్థల్లో ఆ ఒక్కనిపైనే ఆశ పెట్టుకుంటాడు. ఆయనకే భయపడతాడు. ఈ ప్రపంచం అనేక దేవీదేవతల, కార్య నిర్వాహకుల క్షేత్రం కాదన్న సంగతి అతనికి తెలుసు. ఒకే వివేచనా పరుడు, సర్వాధిక్యుడు తన శక్తిసామర్థ్యాల చేత ఈ విశ్వకర్మాగారాన్ని నడుపుతున్నాడన్న వాస్తవం అతనికి సుబోధకం అయింది. ఆయన ఇచ్ఛకు వ్యతిరేకంగా విశ్వ వ్యవస్థలో, దాని వ్యవహారాలలో ఎవరికీ ఏ కాస్త ప్రమేయం కూడా లేదు. ఈ విశ్వాన్ని సృష్టించిన కర్త సత్యమని, ఆయన ప్రేమ సత్యమని, అందుచేత ఈ జగతిలో కేవలం అసత్యమే ఉనికిలో లేదన్న విషయం కూడా అతనికి తెలుసు. అసత్యం లేక అధర్మం స్థాయి పాక్షికమైనది, సాపేక్షిక మైనది, సాంద్రమైనది. సత్యం ఉన్నచోట అదీ ఉంటుంది. పరోక్షంగా సత్యానికే తోడ్పడుతూ ఉంటుంది. ఎవరయితే ఈ పరమ రహస్యాన్ని తెలుసుకున్నాడో అతను ఈ జగతిలోని సౌభాగ్యాన్ని పొందాడు. అతని సౌభాగ్యం అరిగి పోనిది, కరిగిపోనిది. అతని జీవితం అనశ్వరం. అతనెన్నడూ ఒత్తిడికి గురికాడు. ఒంటరితనం అతనిని బాధించదు. అతను నిత్యం నవనవలాడే, పండ్లు ఫలాలనిచ్చే వృక్షం నుండి తింటాడు. సదా ప్రవహించే సెలయేరు నుండి దాహం తీర్చుకుంటాడు.

**"పరిశుద్ధ వాక్కును అల్లాహ్ ఏ వస్తువుతో పోల్చాడో మీరు గమనించటం లేదా? దాని పోలిక ఇలా ఉంది : ఒక మేలు జాతి చెట్టు వుంది. దాని వేరు భూమిలో లోతుగా నాటుకు పోయింది. కొమ్మలు ఆకాశాన్ని అంటాయి. ప్రతి క్షణం అది తన ప్రభువు ఆజ్ఞానుసారం తన పండ్లను ఇస్తోంది. ప్రజలు గుణపాఠం నేర్చుకోవాలని అల్లాహ్ ఇటువంటి ఉపమానాలను ఇస్తున్నాడు" (ఇబ్రాహీమ్: 24,25)**

ఇలాంటి వారే ధన్యులు. కష్టంలోనూ, సుఖంలోనూ వారి మతి చలించదు. సర్వకాల సర్వావస్థలో వారి మస్తిష్కం సమతౌల్యంలో ఉంటుంది. కలిమిగానీ, లేమి గానీ ఏ స్థితి కూడా వారి మనశ్శాంతిని అతలాకుతలం చేయదు. వారి మదిలో కలవరం ఉండదు. వారు నిరాశా నిస్పృహలను దరికి రానీయరు. వారు నిక్కుతూ నడవరు. గర్వాహంకారం ప్రదర్శించరు. వినయ పూర్వకంగా వారు విశ్రాంతి గడియ లను స్వాగతించినట్లే నగుమోముతో పరీక్షలను, కష్టాలు కడగండ్లను కూడా ఆహ్వానిస్తారు. (మరి వారికి లభించే స్వాగతం కూడా అలాగే ఉంటుంది) **"నెమ్మదిని ఆస్వాదించిన ఓ మనసా! పద, నీ ప్రభువు వైపునకు, నీకు లభించే సత్ఫలితానికి పరవశించి పోతూ. నీ ప్రభువునకు ఇష్టమైన దానివై."**

ఇదీ ఏక దైవారాధకుని అంతరంగం. అతను తన అంత రంగంలో పూర్తిగా ఏకాగ్రచిత్తుడై ఉంటాడు. ఇలాంటి ఏకాగ్రతే అతని బాహ్యంపై కూడా ప్రస్ఫుటం అవుతుంది. ఏ విధంగానైతే స్వాభావిక శాసనాల ముందు అతను అశక్తుడై, వివశుడై ఉంటాడో, అదే అశక్తతను, వివశతను దైవాజ్ఞల ముందు కూడా పుణికి పుచ్చుకుంటాడు. అల్లాహ్ అతనికి ప్రసాదించిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సంతోషంగా, ఇష్ట పూర్వకంగా దైవేచ్ఛకు లోబడి ఉండేలా మసలుకుంటాడు. సూర్యచంద్రులు, గాలులు, మేఘాలు, నదీనదాలు, పర్వ తాలు గత్యంతరం లేక దైవానికి విధేయులై ఉంటాయి. ముకుతాడుతో బంధించబడిన ఒంటెల మాదిరిగా అవి తమకు నిర్దేశించబడిన మార్గాల్లో సాగిపోతూ ఉంటాయి. కాని విశ్వాసి అయిన మానవుడు తాను స్వయంగా, తన స్వహస్తాలతో తన ముక్కులో తాడు బిగించుకుని ఈ పయన బృందంలో చేరిపోతాడు. ఇదే మానవుని అసలు సిసలు గౌరవం. ఇదే అతని విశిష్టత. స్వేచ్ఛ ఉండి కూడా తనను తాను దైవాజ్ఞలకు బద్ధుడై ఉండేలా చేయటం అంటే ఇదే. ఇదే తౌహీద్ (ఏకేశ్వరోపాసన) ఊపిరి. ఈ నిర్బంధంలో (అంటే తన్నుతాను కట్టిపడేసుకోవటంలో) అతను ఎంతగా పరిణతి చెందుతాడో, అంతగానే అతని 'తౌహీద్' పరిపక్వత నొందుతుంది. తౌహీద్ మార్గంలో మొదటి దశ ఏమిటంటే మానవుడు తన మనో వాంఛల దాస్యాన్ని వీడి, అల్లాహ్ సమక్షంలో ఆత్మ సమర్పణ చేసుకుంటాడు. తన దాస్యాన్ని, ఉపాసనను అల్లాహ్‌కే ప్రత్యే కించుకుంటాడు. రెండవ దశ ఏమిటంటే అతడు తన జాతి జనుల ఆచార దురాచారాలను, మూఢనమ్మకాలను, అవసరమైతే తన స్వస్థలాన్ని వదలి నిజ ఆరాధ్య దైవం వైపు నకు పరుగెత్తుతాడు. ఆఖరి దశ ఏమిటంటే, ఈ జీవితంపై దైవ సామీప్యానికి, ఆయన ప్రసన్నతకు ప్రాధాన్యతనిస్తాడు.

**ఇన్న సలాతీ వ నుసుకీ వ మహ్యాయ వ మమాతీ లిల్లాహి రబ్బిల్ ఆలమీన్- లా షరీకలహూ వ బిజాలిక ఉమిర్తు వ అనా అవ్వలుల్ ముస్లిమీన్** (నా నమాజ్, నా సకల ఉపాసనారీతులు, నా జీవనం, నా మరణం- సమస్తమూ సకల లోకాలకూ ప్రభువైన అల్లాహ్ కొరకే. ఆయనకు ఏ భాగస్వామీ లేడు. నాకు ఈ ఆజ్ఞయే ఇవ్వబడింది. తలవంచే వారిలో నేను తొలివాడను) (అల్ అన్‌ఆమ్- 162)

**(ఇంకా వుంది)**

**'తౌహీద్ వాస్తవికత'** పుస్తకంలోని కొన్ని అంశాలు మాత్రమే ఇవి. ఈ అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయదలచినవారు 'తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్' ద్వారా పుస్తకాన్ని తెప్పించుకోగలరు.

సహజీవన భావనల పావురాయి గీటురాయి వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థా లను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# నూతన విద్యా విధానం ముందున్న సవాళ్ళు




డాక్టర్ మహ్మద్ హసన్

**బ్రిటీష్** వారి కాలంలో ప్రవేశపెట్టబడిన "మెకాలే విద్యా విధానం" ఎంతమేరకు సఫలీకృతమైందన్నది పక్కన పెడితే బ్రిటీష్ వారి స్వార్థం, స్వలాభం ఈ విద్యా విధానం ద్వారా నెరవేరిందని చెప్పాలి. ఇక దేశానికి స్వాతంత్ర్యము వచ్చే నాటికి దేశ జనాభా సుమారు 28 కోట్లు అక్షరాస్యత శాతం 14% అంటే దీనిని బట్టి ఆంగ్ల విద్యా విధానం ఎంతమందికి అందుబాటులో ఉండేదో అర్థం చేసుకోవచ్చును.

అధికార మార్పిడి జరిగిన తర్వాత మనకు మనం స్వతంత్రంగా అడుగులు వేయడం అస్తవ్యస్తంగా వున్న వ్యవస్థను గాడిన పెట్టడం నెహ్రూ లాంటి మేధావికి, వారి మంత్రివర్గంలో ఉన్న వారందరికీ కత్తి మీద సామే అయ్యింది. ముఖ్యంగా దేశంలో అనేక రకాల సమస్యలు అప్పటికే తిష్ఠవేసుకుని వెక్కిరిస్తున్నాయ్. వాటి నుండి బయటపడటానికి, సంక్షోభం నుండి సమస్య పరిష్కారం వైపు చాలా సుదీర్ఘమైన ప్రయాణమే చేయాల్సి వచ్చింది అప్పటి ప్రభుత్వానికి. ఇది ఎవరు కాదనలేరు కూడా. అందుకే "లౌకిక విద్యా విధానాన్ని" ప్రోత్సహిం చాలనే ఉద్దేశ్యంతోనే రాజ్యాంగం లోని "45వ నిబంధన" (Article- 45) 6-14 సంవత్సరాలలోపు బాలబాలికలకు "ఉచిత నిర్భంద ప్రాథమిక విద్య"ను అందిం చాలని సూచించింది.

అలాగే "విద్య" ఉమ్మడి జాబితాలో ఉండటం వల్ల రాష్ట్రాలకు నిధులు ఇస్తూనే కొంత స్వేచ్ఛను కూడా విద్యా సంస్థల విషయంలో ఇవ్వటం జరిగింది. బ్రిటీష్ వారి కాలంలోనే క్రైస్తవ మిషనరీలు, మదర్సాలు, గురుకులాలు ఉండటం వల్ల వీటన్నింటినీ ఒకే గొడుగు క్రిందకు తీసుకొని రావాలన్న ఉద్దేశ్యంతోనే "సార్వత్రిక విద్యా విధానానికి" (Universal Education) అంకురార్పణ చేశారు. విద్యకు సంబంధించి రాజ్యాంగం కల్పించిన అవకాశాలు ఏంటో ఒకసారి పరికిద్దాం. 350 (A) నిబంధన ప్రకారం ప్రాథమిక స్థాయిలో మాతృ భాషలో విద్యా బోధనకు అవకాశాలు కల్పించాలి. దీనిని ఆధారం చేసుకునే కొఠారి కమిషన్ (1964-66) "త్రిభాషా సూత్రం" అమలు చేయాలని సూచించింది. దీని ప్రకారం మాతృ భాష, జాతీయ భాష ఐన హిందీ అలాగే అంతర్జాతీయ భాష ఐన ఆంగ్లం బోధించాలనేది దీని సారాంశం. ఇది క్రమంగా మాతృ బాషలు కనుమరుగయ్యేలా చేసింది. అంతెందుకు మన తెలుగు రాష్ట్రాలలోనే మన మాతృ భాష స్థానం ఏమిటో ఆత్మ విమర్శ చేసుకుంటే దేశం ముఖ చిత్రం స్పష్టంగా అవగతం అవుతుంది. రానురాను ఆంగ్ల భాషా ప్రాబల్యం పెరిగిపోవటం, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ఆంగ్ల భాషలో పట్టు సాధించిన వారికే ఉండటం వల్ల మాతృభాషలు క్షీణించే పరిస్థితికి దారి తీస్తుంది. నూతన విద్యా విధానం మాతృ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించటం మంచి పరిణామమే దీనిని పకడ్బందీగా అమలు చేయాలి.

46వ నిబంధన ప్రకారం షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు (SC,ST) విద్యాపరమైన సదుపాయాలు, ఆర్థిక సహకారం కల్పించటం. దీని ద్వారా విద్యా విషయంలో వెనుకబాటు తనంను దూరం చేయొచ్చన్న ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశారు. నేటికి కొంతమంది చదువుకు దూరంగా ఉంటున్నట్లు గణాంకాలు చెప్తున్నాయ్. "ఆజాదికా అమృత్ మహోత్సవ" వేళ దేశంలోని స్త్రీలకు విద్యావకాశాలు కల్పించాలన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం స్త్రీల సగటు అక్షరాస్యత శాతం 65.46% అంటే దేశ జనాభాలో సుమారు 35% మంది మహిళలు విద్యకు దూరంగానే వున్నారు.

ఇది నూతన విద్యా విధానానికి అతిపెద్ద సవాలుగా మారనుంది తరగతి గదికి దూరంగా వున్న బాలికలను గుర్తించటం, నమోదు చేసుకోవటం వారికి విద్యా సదుపాయాలు కల్పించటం, అతిపెద్ద సవాలు. బాలికలు ఉన్నత చదువులు చదివే వరకు అన్ని సదుపాయాలూ కల్పిస్తే కొంతమేర మంచి ఫలితాలు రాబట్ట వచ్చు. అలాగే విద్యా విధానంలోని అసమానతలు తొలగించి సాధారణ విద్య అందరికి సమానంగా అందేటట్లు చర్యలు తీసుకొని స్త్రీలకు సమాన అవకాశాలు కల్పించటం, స్త్రీలను అబలలుగా, అసమర్థులుగా పరిగణించే భావాన్ని తొలగించటం, ఉద్యోగాలలో సమాన అవకాశాలు కల్పించటం, బాలికల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ కల్పించటం, పాఠశాలల్లో బాలికలకు మరుగు దొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి మహిళా టీచర్లను నియమించాలి. అదేవిధంగా సార్వత్రిక నమోదు (Universal Enrolment) బడికి దూరంగా (Dropout) వున్న వారిని గుర్తించి నమోదు చేసుకోవాలి. బడిలో చేరిన పిల్లలందరూ ప్రాథమిక విద్యను పూర్తిచేసే వరకు పాఠశాలలోనే విద్యను అభ్యసించేలా ప్రోత్సహించటం నిరంతరం పర్యవేక్షించటం, మెరుగైన సౌకర్యాలు కల్పించటం లాంటివి చేయాలి. అలాగే సార్వత్రిక సాధన (Universal Achievement) పాఠశాలలో చేరిన పిల్లలందరూ ఆశించిన కనీస "అభ్యసనా సామర్థ్యాలు" (Minimum Level Of Learning) సాదిస్తున్నారా లేదా అనేది పరిశీలించాలి నిరంతర సమగ్ర మూల్యాంకనం (CCE) ప్రస్తుతం అమలులో వుంది. కాని ఇది పెద్దగా విజయం సాధించిన దాఖలాలు లేవు. దేశవ్యాప్తంగా ఇటీవలే యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ ప్రకారం 14-18 సం.ల మధ్య వయసున్న విద్యార్థుల్లో విద్యకు సంబంధించిన పునాది నేటికి బలహీనంగా ఉందని తేల్చటం ఆశ్చర్యం కల్గించే అంశం. ఈ నివేదిక ప్రకారం 14-18 సం॥రాల మధ్య వయస్సున్న వారిలో కేవలం 73.6% మంది పిల్లలు మాత్రమే స్టాండర్డ్- 2 పుస్తకాన్ని చదువగల్గు తున్నారు. గణితంలో కేవలం 45% మందికే ప్రాథమిక నైపుణ్యం వుందనేది ఆ నివేదిక సారాంశం.

ఇక 2022లో విడుదలైన పీరియడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం నిరక్షరాస్యుల్లో సాధారణ స్థాయి వరకు చదువుకొన్నవారిలో నిరుద్యోగం రేటు వరుసగా 0.4%, 1.0% వుంది. విద్యావంతులైన వారందరికి ఉద్యోగాలు, సరైన ఉపాధి అవకాశాలు లభించటం లేదనేది, కేవలం 45% మంది చదువుకున్న యువత వారి వారి నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగాలు చేస్తున్నారని "మెర్సర్ మెటిల్" సంస్థ వెల్లడించటం మన విద్యా విధానంలోని డొల్లతనాన్ని తెలియజేస్తుంది. ఇది కూడా నూతన విద్య విధానానికి పెను సవాల్ విసరనుంది. గత సంవత్సరం ఏప్రిల్‌లో విడుదలైన బ్లూమ్ బర్గ్ నివేదిక ప్రకారం మనదేశంలో విద్యనభ్యసించిన పట్టభద్రుల్లో నైపుణ్యం పరిమితంగా ఉండటమో, లేక పూర్తిగా లేకపోవటం వల్ల నిరుద్యోగ శాతం పెరుగుతుందని వెల్లడించింది. మరొక విచిత్రమైన అంశం ఏమిటంటే చదివిన డిగ్రీకి చేస్తున్న ఉద్యోగానికి సంబంధం లేకపోవటం ఆశ్యర్యకరమైన విషయం. దీని నివారణకు నూతన విద్యా విధానంలో చర్యలు చేపట్టాలి. ఇక ఉన్నత పాఠశాల స్థాయిలో ఆంగ్ల మాధ్యమాన్ని పటిష్ఠం చేస్తూనే "ప్రాజెక్ట్ బేస్డ్ విద్యా వ్యవస్థను" ప్రోత్సహించి పిల్లలను సెమిస్టర్ విధానం వైపు మళ్ళించాలి. ఎలాగు నూతన విద్యా విధానం లోకి (5:3:3:4) మన విద్యా విధానం మారబోతున్నం దున కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు విద్యా గ్రాంట్లు, నిధులు ఎక్కువ కేటాయించి పాఠశాలల్లో, కళాశాలల్లో, అలాగే విశ్వ విద్యాలయాలలో మౌలిక సదుపాయాల టీచింగ్, నాన్ టీచింగ్ ఇతర సౌకర్యాల కొరతను నివారించడానికి ప్రణాళికాబద్ధంగా




చర్యలు చేపట్టి దేశవ్యాప్తంగా ఒకే రకమైన విద్యా విధానాన్ని (Common School System) ప్రవేశపెట్టాలి. ఇది ఆచరణాత్మకంగా అమలు జరిగేలాగా కేంద్రం, రాష్ట్రాలు ఎప్పటికప్పుడు సమీక్ష చేయాలి. "విద్య" అనేది వ్యాపార వస్తువు కాదని, విద్యా పరమావధి మంచి సమాజాన్ని మంచిపౌరులను తీర్చిదిద్దేది విద్య ద్వారానే అనే మూల సూత్రాన్ని ప్రభుత్వాలు, వివిధ యాజమాన్యాలు గుర్తించాలి. విద్యా సంస్థల్లో పాఠ్య, సహపాఠ్య, పాఠ్యేతర కార్యక్రమాలు ప్రోత్సహించి, శారీరక వికాసం పొందేవిధానంగా క్రీడలు, వ్యాయామశాలలు, ఆట స్థలాలు, ప్రతి పాఠశాలకు ఉండేలా చర్యలు చేపట్టాలి. విద్యార్థులు మానసిక వికాసం చెందేవిధంగా క్షేత్ర పర్యటనలు, ఎగ్జిబిషన్లు, సైన్సు ఫేర్లు మొదలైనవి నిర్వహించి పిల్లల్లో సృజనాత్మకమైన వైఖరులు పెంపొందే విధంగా తగుచర్యలు చేపట్టాలి అలాంటి విద్యార్థులకు ప్రోత్సాకాలు, విద్యాపరమైన రాయితీలు ఇచ్చే సదుపాయం ఆయా ప్రభుత్వాలు కల్పించాలి. అదేవిధంగా తరగతి గదిలో పిల్లలు "సులువైన బోధన గావించే విధంగా సులభం నుండి కఠినం వైపు మళ్ళించేలా" విద్యా ప్రణాళికలు, పాఠ్యప్రణాళికలు రూపొందించాలి. అలాగే విద్యార్థి ఒక తరగతి నుండి పై తరగతికి మారటానికి "వృధా" (Wastage), స్తబ్దతను (Stagnation) నివారించడానికి భారరహిత అభ్యసనం (Learning Without Burden) విధానాన్ని ప్రోత్సహించాలి. వాటి కొరకు నెల వారి సమీక్షలు, పర్యవేక్షణ జరగాలి. రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ (RMSA) ప్రకారం 2009-10 నుండి 2019-2020 వరకు సర్వశిక్ష అభియాన్ ప్రకారం చేసిన 82వ రాజ్యాంగ సవరణ 6-14 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యా అమలును ప్రతి ఆరునెలలకొకసారి దేశవ్యాప్తంగా సమీక్ష చేయాలి. దేశవ్యాప్తంగా అమలు జరుగు తున్న మధ్యాహ్న బోజన పథకంలో పౌష్టికాహారం అందేలా చర్యలు చేపట్టాలి. ప్రాథమిక దశ నుండే కంప్యూటర్ పరిజ్ఞానం విద్యార్థు లలో పెరిగేలా దేశవ్యాప్తంగా చర్యలు చేపట్టాలి. దానికి అనుగుణమైన ఏర్పాట్లు అన్ని పాఠశాలలో మానవ వనరుల కొరత లేకుండా ఏర్పాట్లు చేయాలి. అలాగే కంప్యూటర్ విద్యకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు తక్షణమే అమలు జరిగేలా చూడాలి. ప్రతి పాఠశాలకు, కళాశాలకు లేదా యూనివర్సిటీ స్థాయి వరకు తల్లిదండ్రుల భాగస్వామ్యం, వారితో అనుసంధానం ఉండేలా సమన్వయం చేయాలి. విద్య ద్వారా ఆత్మ జ్ఞానాన్ని, సంపూర్ణ మూర్తిమత్వాన్ని, నైతిక విలువలను సృజనాత్మక శక్తులను పెంపొందించేలా చర్యలు చేపట్టాలి. అలాగే జాతీయ సమైక్యతను, ప్రజాస్వామ్య విలువలు, లౌకిక విలువలు విద్యార్థుల్లో పెంపొందే విధంగా విద్యా ప్రణాళికను రూపొందించాలి. పాఠ్యాంశాలు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక జీవన విలువలకు అనుగుణంగా రూపొందించాలి. స్కూల్ బ్యాగు బరువును, పిల్లలు చేస్తున్న అభ్యాసాలను తగ్గించాలని (భారరహిత అభ్యసనం) గతంలోనే యశ్పాల్ కమిటీ (1993) సూచించింది. దీనిని ప్రైవేట్ యాజమాన్యాలు ఎప్పుడో అటకకెక్కించాయి. తిరిగి కేంద్ర ప్రభుత్వం ఇటీవలె పుస్తకాల బరువును తగ్గించాలని సూచన ప్రాయంగా అంగీకరించడం శుభ పరిణామమే. ఇది కార్యరూపం దాల్చితే బాగుంటుంది. అలాగే ఇటీవలె CBSE చూచిరాతల పరీక్ష విధానాన్ని ఎంపిక చేసిన పాఠశాలల్లో 9 నుండి12వ తరగతి విద్యార్థులకు ప్రయోగాత్మకంగా అమలు చేయాలని నిర్ణయించటం ఆందోళన కల్గించే విషయం దీనిపై పునరాలోచించాలి. ఇది పిల్లలను తరగతి గది నుండి దూరం చేయడమే తప్ప దీనివల్ల ప్రయోజనం మనలాంటి దేశాలకు పెద్దగా ఉండదు. జపాన్, దక్షణ కొరియా లాంటి చిన్న దేశాలు తయారు చేస్తున్న ఎలక్ట్రానిక్ పరికరాలు దిగుమతి చేసుకుంటున్నామంటే లోపం ఎక్కడుందో ఓసారి విద్యా నిపుణులు ఆలోచన చేయాలి. అలాగే నూతన విద్యా విధానం అన్ని రాష్ట్రాలకు ఒకేసారి అమలు జరిగే విధంగా సాధ్యమైనంత తొందరగా చర్యలు తీసుకోవాలి.

పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు పిల్లలకు గంజాయి, డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాలు దొరికే స్థలాలుగా కొన్ని విద్యా సంస్థలు తయారైనాయి. అలాంటి సంఘటనలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విద్యా సంస్థలను తయారు చేయాలి. అర్హత వున్న అధ్యాపకులను నియమించి తరగతి గదిలోకి పిల్లల ప్రపంచాన్ని తీసుకొని రావాలి, తరగతి గది అంటే విద్యార్థుల ప్రపంచంగా పిల్లలు భావించేలా ఏర్పాట్లు చేయాలి. తరగతి గది అంటే మానసిక ఒత్తిడితో కూడినదనే భావన విద్యార్థులలోంచి తొలగించాలి. భవిష్యత్తుకు తగిన అవసరాలను గుర్తించి కనీస అవసరాలు, కనీస అభ్యాసన సామర్థ్యాల స్థాయిని పెంచటమే కాకుండా "విద్య" అనేది మనిషి ప్రవర్తనలో మానసికపరమైన, విశాలమైన ఆలోచనా దృక్పథం పెంపొందేలా వుండాలి అలాంటి విద్యా విధానమే భవిష్యత్తులో ఉత్తమ పౌరులను తయారు చేస్తుంది. అది దేశానికి కూడా ఉపయోగపడుతుంది.

నాటకం

# దేవుడు ఇచ్చిన అద్భుత వనరు

# నీరు



**- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

మనకు తెలిసీ తెలియకుండానే నీటిని వృథా చేస్తుంటాం. షేవింగ్ చేసుకునేటప్పుడు, పాత్రలను శుభ్రం చేసేటప్పుడు చాలా మంది ట్యాప్‌ను అలాగే వదిలేస్తుంటారు. ట్యాప్ నుంచి ఒక్కో సెకన్‌కు లీకయ్యే నీటి చుక్క రోజుకు 3.5 లీటర్ల నీటికి సమానం. వేసవి రాగానే తాగు నీరు లభించక పశు పక్షాదులు మృత్యువాత పడే ఉదంతాలను అనేకం చూసే ఉంటారు. నీటిని జాగ్రత్తగా పొదుపు చేసుకోకపోతే రేపు మన పిల్లలు కూడా ఇలాంటి స్థితిని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఆ నిమిత్తం పిల్లల్లో మార్పు తీసుకురావాలని చేసిన చిరు ప్రయత్నమే ఈ నాటకం. **- రచయిత**

**ఇందులో పాత్రలు :** హసన్ (కెమిస్ట్రీ లెక్చరర్) హఫీజ్ (సామాజిక వేత్త) నదా (వాటర్ సప్లైయిలో ఉద్యోగిని) హయా (విద్యార్థిని) హమద్ (విద్యార్థి), హనాన్ (విద్యార్థిని).

ఈ విశ్వంలో సమస్త జీవకోటికి నీరే ప్రాణాధారం. నీరు ఎక్కడ ఉంటే అక్కడ ఆహ్లాదం వెల్లివిరుస్తుంది. పల్లెకైనా, నగరానికైనా నీటి వనరులు ఎంతో అవసరం. అభివృద్ధి విస్తరణకు కూడా నీరే ప్రధానం. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి అవసరం పెరుగుతోంది.

ప్రతి ప్రాణిని మేము నీటితో సృజించిన విషయాన్ని వీరు గమనించ లేదా? మరి వారు (మాయీ సృష్టి చాతుర్యాన్ని) ఎందుకు విశ్వసించరు? (అంబియా: 30)

**హమద్ :** అమ్మా.....అమ్మా బాత్‌రూమ్‌లో నీళ్ళు రావడం లేదు.

**నదా :** ట్యాంక్‌లో నీళ్ళు అయిపోయాయి అనుకుంటా. ఉండు మోటార్ వేస్తా, అయినా హమద్ ఎంత సేపయింది నువ్వు స్నానానికి వెళ్ళి? షవర్ వేసుకుంటావు... ఎంతసేపు స్నానం చేస్తావో నీకే తెలియదు. అలా నీళ్ళు వేస్ట్ చేస్తుంటే ఎలా చెప్పు ?

**హసన్ :** అవును నదా నేను కూడా చెబుతుంటాను. షవర్‌తో చేయకు, ముందుగా బకెట్లో నీళ్ళు నింపుకొని మగ్‌తో చేయమని. చూడు ఏమయిందో ?

**హయా :** నాన్న కరెంట్ కూడా పోయింది. ఇప్పుడు వాడికి నీళ్ళెట్ల. మంచి పని అయింది కరెంటు వచ్చేదాకా తమ్ముడు నువ్వు బాత్ రూమ్‌లోనే ఉండు.

**హమద్ :** అమ్మా ఇప్పుడెలా?

**నదా :** ఎలా అంటే నేనేం చేయను. ఇదిగో ఈ బకెట్‌లో కొన్ని నీళ్ళున్నాయి. దాంతో స్నానం పూర్తి చేసుకొనిరా.

**హనాన్ :** అమ్మా నువ్వేమో water supply departmentలో ఇంజనీరయితే వాడేమో water waste managementలో ఇంజనీరవుతాడు. వ్వె...వ్వె...వ్వె

**హయా :** అమ్మా ఏంటి ఈ రోజు చాలా హడావుడి పడుతున్నావు. వంటింట్లో నుండి బయటకే రావడం లేదు. వెరైటీస్ చాలా చేస్తున్నావు ఏంటి సంగతి?

**హసన్** : మన కోసం కాదులే హయా. అవన్నీ మీ అమ్మకు ప్రియమైన తమ్ముడు వస్తున్నాడు కదా తనకోసం..

**హమద్**: వాట్ హఫీజ్ మామయ్య వస్తున్నాడా. నాకు బోలెడన్ని చాక్లెట్లు తెస్తాడు.

**సదా** : అవునురా చాలా రోజుల తరువాత వస్తున్నాడు మీ మామయ్యా. అందుకే వాడికిష్టమైన వంటకాలను చేస్తున్నా. (కారు శబ్దం వినిపిస్తుంది) అదిగో మామయ్య వచ్చాడు.

అస్సలాము అలైకుమ్ భాయి జాన్, బాగున్నావా? అక్కయ్య, హాయ్... పిల్లలు ఇదిగో మీ చాక్లెట్లు...

**హమద్** : నేను చెప్పానా నా కిష్టమైన చాక్లెట్లు తెస్తాడని.

**హసన్** : ఏంటోయ్... ఈ మధ్య రావడమే మానేసావు. చాలా రోజులు అయింది నువ్వొచ్చి.

**హఫీజ్** : అవును బావగారు ఈ మధ్య బాగా బిజీగా తిరగడం జరుగుతుంది. అన్ని ప్రాంతాలలో నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాలు చేస్తున్నాం.

**హనాన్** : అబ్బా మామయ్యా అన్ని ప్రదేశాలు తిరుగుతున్నావా. నాకు కూడా అన్ని ప్రాంతాలకు వెళ్ళడం అంటే చాలా ఇష్టం.

**హమద్** : నీలాగా time pass కోసం వెళ్ళలేదు మామయ్యా. నీటిని ఎలా పొదుపుగా వాడుకోవాలో, వర్షపు నీటిని ఎలా ఉపయోగించుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించడానికి వెళ్ళారు.

**హయా**: ముందు హమద్‌కు అవగాహన కల్పించాలి మామయ్యా. గంటలు, గంటలు షవర్ కింద స్నానం చేస్తాడు, నీళ్ళను వృధా చేస్తున్నాడు.

**హమద్** : పైన ట్యాంక్ నిండా నీళ్ళు ఉన్నప్పుడు బాగా వాడుకుంటే ఏమవుతుంది. నువ్వేమన్నా కొనుక్కొస్తున్నావా? మున్సిపాలిటి వారి కొళాయి నీళ్ళే కదా.

**హఫీజ్** : అలా కాదురా హమద్ నీళ్ళు ఎన్ని ఉన్నాయి అని కాదు చూడవలసింది. నీటిని పొదుపుగా వాడడం అనేది మన attitude కావాలి. ఎక్కువ ఉంటే ఎక్కువ వాడి, తక్కువ ఉంటే తక్కువ వాడడం కాదు. అవసరానికి అనుగుణంగా నీటిని వాడడం ఒక అలవాటుగా మార్చుకోవాలి. లేకపోతే భవిష్యత్తులో నీటి కొరతను బాగా ఎదుర్కోవలసి వస్తుంది.

**హమద్**: అదేంటి మామయ్యా భూమిపై మూడు వంతులు నీరే కదా అందులో నేల భాగమే తక్కువ. అంత నీరు ఉన్న తరువాత నీటి కొరత ఎందుకు వస్తుంది?

**హఫీజ్** : నువ్వన్నట్టు భూగోళంపై 3 వంతుల నీరు 1 వంతు భూమి మాత్రమే ఉంది కాని అందులో 97% వరకు నీరు మహా సముద్రాలలో ఉంది.

**హమద్** : అయితే ఏంటి?

**హఫీజ్** : అయితే ఏంటి అని అడుగుతావేమిట్రా అందులో ఉన్నదంతా ఉప్పు నీరు కదా. తాగడానికి కాదు గదా. మన నిత్య జీవితంలోని పనులకు కూడా ఉపయోగపడదు.

**హనాన్** : అవును మామయ్యా ఈ సముద్రం నీరు ఇంత ఉప్పగా ఎందుకు మారింది మామయ్యా.

**హఫీజ్** : ముందు ఈ సంగతి చెప్పు మనకు నీరు ఎక్కడి నుండి లభిస్తుంది?

**హనాన్** : వర్షం ద్వారా.

**హఫీజ్** : కదా! ఎక్కడెక్కడో పడిన వర్షం చిన్న కాలువల ద్వారా, నదులలోకి, నదుల ద్వారా సముద్రంలోకి చేరుతాయి. అలా చేరడానికి ముందుగా ఆ నీరు అనేక ప్రాంతాల గుండా ప్రయాణిస్తుంది. అప్పుడు ఆయా ప్రాంతాలలో ఉన్న నేలలో ఉన్న లవణాలు నీటిలో కలిసి అవి కూడా సముద్రంలో కలుస్తాయి. దాంతో సముద్రం నీరు ఉప్పగా అయిపోతాయి.

**హయా** : అవునవును వేరు వేరు ప్రాంతాల నుండి నదులు తీసుకు వచ్చిన లవణాలతో సముద్రం ఒక సూప్‌గా తయారవుతుందన్న మాట. సముద్ర సాంబార్ అన్న మాట.

**హసన్**: అవును ఇంతకూ ఇడ్లి సాంబార్ అయిందా? మాకు టిఫిన్ పెట్టేది ఉందా లేదా.....

**సదా**: రండి...రండి.... మీదే ఆలస్యం.

**హమద్** : అమ్మా ఇడ్లి సాంబార్ చాలా బాగుందమ్మా. సముద్ర సాంబార్ లాగ ఉప్పగా లేదు. బాగుంది.

**హయా** : చూసావా మామయ్యా ఒట్టి చేయి కడగడానికే ఎన్ని నీళ్ళు వృధా చేస్తున్నాడు.

**హమద్** : అవును మామయ్యా సముద్రం నీరు గురించి చెబుతున్నావు కదా. సముద్రం నీరు ఎంత శాతం ? మనం ఉపయోగించే నీటి శాతం ఎంత?

**హఫీజ్** : నీకు చెపితే చాలా ఆశ్చర్యపోతావు హమద్. మొత్తం

భూగోళంలో 97 శాతం నీరు సముద్రంలో ఉంది. అది మనకు ఉపయోగపడదు. మిగతా 3 శాతమే మనకు ఉపయోగపడే నీరన్నమాట.

**హనాన్ :** అమ్మో 3 శాతం నీరు ప్రపంచంలోని ప్రజలందరి దాహార్తిని తీరుస్తుందన్న మాట.

**హఫీజ్ :** ఆ మూడు శాతం కూడా అందుబాటులో లేదు.

**హనాన్:** ఎందుకు మామయ్యా?

**హఫీజ్:** ఎందుకంటే ఆ 3 శాతంలో ఉన్న మంచి నీటిలో 1 శాతం వరకు మంచు రూపంలో మంచు ఖండాలలో ఉంది. అంటే అది మనకు పనికి రాదన్న మాట. అవును ఇంకొక్క శాతం భూమి లోపల భూగర్భ జలం రూపంలో కొంత, నీటి ఆవిరి రూపంలో కొంత ఉందన్న మాట.

**హయా:** అంటే మనకు ఉపయోగపడే నీరు 1 శాతమేనా ?

**హఫీజ్ :** అవును నదులు, చెరువులు, సరస్సులు, బావుల మొదలగు నీటి వనరుల ద్వారా ఆ ఒక్క శాతం పొందుతున్నాం. అదీ వర్షాలు పడి నదులు, చెరువులు నిండితేనే. వర్షాలు లేకపోతె అదీ లేదు. నీటి కోసం కటకట లాడాల్సిందే.

**హమద్ :** అమ్మో...! వింటుంటేనే భయం వేస్తుంది. అందుకేనా నీటిని పొదుపు చేయి అని నా వెంట పడుతున్నారు.

**నదా :** ఇప్పటికైనా నీటి విలువ తెలుసుకున్నావు కదా, ఇక నీ attitude మార్చుకో.

**హమద్:** ఇంత తెలిసాక మార్చుకోనా... అమ్మా దాహం అవుతుంది పూర్తి గ్లాసు కాదు సగం గ్లాసు మంచి నీళ్ళు ఇవ్వు.

**నదా:** మాషా అల్లాహ్ .. శభాష్!

**హసన్:** అవును హఫీజ్... నువ్వు చాలా బిజీ అన్నావు కదా. అన్ని ప్రాంతాలకు వెళ్ళి నీటి పొదుపు పై చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నావు కదా! ఏ ఏ కార్యక్రమాలు నిర్వహిస్తున్నావు, ఎలా నిర్వహిస్తున్నావు?

**హఫీజ్:** మంచి నీరు మనకు లభించేది వర్షం ద్వారా మాత్రమె కాని, దురదృష్టం ఏమిటంటే వర్షాలు కురిసినా ఆ నీటిని మాత్రం మనం నిలుపుకోలేకపోతున్నాం.

**హనాన్ :** ఎందుకు మామయ్యా ?

**హఫీజ్ :** ఎందుకేమిటి వర్ష రూపంలో పడిన నీరు సగానికి సగం కాలువలుగా, నదులుగా వెళ్ళి సముద్రంలో కలుస్తున్నాయి కదా!

**హనాన్:** అవునవును ఇప్పుడే అనుకున్నాం కదా.

**నదా:** అయితే తమ్ముడు మరి ఈ వర్షపు నీరు వృధా కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలని ప్రజలను చైతన్య పరుస్తున్నావు?

**హఫీజ్:** వర్షపు నీరు నిలువ చేసుకోవడానికి ప్రతి ఒక్కరు ప్రయత్నించాలి. దాని కోసం ఇంకుడు గుంతలను నిర్మించు కోవాలి. వాటర్ షెడ్ లను నిర్మించుకోవాలి.

**హయా :** ఇంకుడు గుంతనా అంటే ?

**హఫీజ్ :** ఇంకుడు గుంత అంటే మన ఇంటి ఆవరణలో 2 మీ పొడవు, 2 మీ వెడల్పు 2 మీ లోతుతో ఒక గుంతను తీయ్యాలి. ఆ గోతిలో సగం వరకు దొడ్డు కంకర వెయ్యాలి. మిగతా భాగంలో సగం వరకు సన్న కంకర వెయ్యాలి. మిగిలిన భాగం ఇసుకతో నింపాలి. అందులోకి ఇంటి డాబా పై పడిన వర్షపు నీరు పైపుల ద్వారా గుంతలోనికి వచ్చేటట్లు ఏర్పాట్లు చెయ్యాలి. దాంతో వర్షపు నీరు వృధా కాకుండా ఇంకుడు గుంతల ద్వారా నేలలోకి వెళ్ళి భూగర్భ జలాన్ని పెంచుతుంది. దాంతో బావులు, బోరులు ఎండిపోకుండ నీటితో సమృద్ధిగా ఉంటాయి. పొలాల దగ్గర కూడా లోతట్టు ప్రాంతాలలో వాటర్ షెడ్ ఏర్పాటు చేసుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయి. ప్రతి గ్రామానికి వెళ్ళి నేను ప్రచారం చేస్తుంది ఈ విషయాలే.

**హమద్:** ఏమైన మార్పులు వచ్చాయా? మామయ్యా!

**హఫీజ్ :** చాలా మంది ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటు న్నారు. నీటి ప్రాముఖ్యత గూర్చి అర్థం చేసుకుంటున్నారు.

**నదా:** చాలా మంచి పని చేస్తున్నావు తమ్ముడు నీరు నిజంగా ప్రకృతి ఇచ్చిన గొప్ప వనరు.


దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

**హయా:** అవును అమ్మా! నీటికి అంత గొప్ప ప్రాముఖ్యత ఎలా వచ్చింది మొక్కలకు జంతువులకు నీరు ప్రాణాధారము అంటాం ఎందుకని?

**హఫీజ్:** అవన్నీ తెలుసుకోవాలంటే నీటి కథను తెలుసుకోవాలి. ఆ నీటి కథను నాకంటె కెమిస్ట్రీ లెక్చరర్ అయిన మీ నాన్న బాగా చెబుతాడు.

**నదా:** పదండి భోజనం చేసిన తరువాత నీటి కథ గురించి విందాం.

**హనాన్:** అవునవును అసలే మామయ్య వచ్చాడని అమ్మ రకరకాల వంటకాలు చేసింది. పదండి అన్నింటిని ఒక పట్టు పట్టేద్దాం.

**హమద్ :** అల్హందులిల్లాహ్... కడుపు నిండిపోయింది.

**నదా :** ఇదిగో మంచి నీళ్ళు తాగు.

**హమద్:** అమ్మో...! ఒక్క చుక్క నీరు కూడా పట్టదు కడుపులో. నీరంటే గుర్తొచ్చింది. నాన్నా నాకు నీటి కథ చెబుతానన్నావు ప్లీజ్ చెప్పవా.

**హసన్:** సరే, చెబుతాను నీరు అనేది నిజంగా దేవుడు ఇచ్చిన గొప్ప ఒనరు. నీటికి అంత ప్రత్యేకత రావడానికి కారణం నీరుకున్న ప్రత్యేక లక్షణాలు. అన్నట్టు హమద్ నీరు మనకు ఎన్ని రూపాలలో దొరుకుతుంది?

**హమద్:** మూడు రూపాల్లో దొరుకుతుంది నాన్న గారు... ఘన రూపం, ద్రవ రూపం, వాయు రూపం.

**హయా:** అమ్మా ఘన రూపం అంటే గుర్తొచ్చింది ఫ్రిజ్‌లో నీటి ఘన రూపం ఉంది పెట్టవా?

**నదా:** నీటి ఘన రూపమా ఏంటది?

**హనాన్:** అదే అమ్మా ! ఐస్ క్రీమ్ అని తన ఉద్దేశం.

**నదా:** హాయ్ అల్లాహ్.. అదా! ఇప్పుడే తెస్తాను.

**హయా:** వీడికెప్పుడు తిండి ధ్యాసె. నువ్వు చెప్పు నాన్న నీటి గురించి.

**హసన్:** నీటికున్న మరొక అద్భుతమైన లక్షణం.. నీరు సార్వత్రిక ద్రావణి.

**హమద్:** సార్వత్రిక ద్రావణి అంటే ఏమిటి ?

**హసన్:** సార్వత్రిక ద్రావణి అంటే చాలా పదార్థాలను తనలో కరిగించుకొనేది అన్న మాట.

**హనాన్:** అవునవును నీ పొట్ట లాగ.

**హమద్:** వె....వె...వె!

**హసన్ :** నీటికి ఉన్న ఈ లక్షణం వల్లనే మొక్కలకు కావలసిన లవణాలన్ని నీటిలో కరిగి మొక్కకు అందుతున్నాయి. అంతే కాదు మనం తీసుకున్న ఆహారంలోని అన్ని రకాల పోషకాలు నీటిలో కరిగి రక్తంలో కలిసి శరీరంలోని అన్ని కణాలకు అందజేయ బడుతున్నాయి. అంతే కాదు జీవక్రియలో ఉత్పన్నమైన మలిన పదార్థాలు కూడ నీటి ద్వారానే విసర్జింపబడతాయి. అందుకే నీరు లేకపోతె జీవజాతి నశిస్తుంది.

**నదా:** నిజంగా ఇంత గొప్పదైన నీటి లక్షణాలను బయటి ప్రపంచానికి తెలియజేసింది ఎవరు ?

**హఫీజ్:** మొట్ట మొదటిసారిగా 1781లో హెన్రికావెండిష్, నీరు ఎలిమెంట్ కాదు మాలిక్యూల్ అని, తరువాత 1783లో లేవోయిజర్ నీరు అనేది హైడ్రోజన్ మరియు ఆక్సీజన్ సమ్మేళన మని ప్రయోగ పూర్వకంగా ఋజువు చేశాడు.

**హమద్:** అవునవును నేను కూడా మా స్కూల్లో నీటి విద్యుత్ విశ్లేషణ ప్రయోగం చేసి హైడ్రోజన్‌ను, ఆక్సిజన్ హైడ్రాక్సైడ్ అయాన్‌ను విడదీసాను.

**హనాన్:** అబ్బో... లెవోయిజర్ శిష్యుడు బయలు దేరాడు.

**హసన్:** కాని గమ్మత్తేమిటంటే నీరు అటు ఆక్సీజన్ లక్షణాలను చూపకుండ, ఇటు హైడ్రోజన్ లక్షణాలను చూపకుండ ఒక కొత్త లక్షణంతో జీవజాతికి అవసరమైన వనరుగా మారింది.

**నదా:** నీటికున్న మరో అద్భుతమైన లక్షణం నేను చెప్పనా నీరు మూడు రూపాలలోకి మారుతుంది. అంటే ఐస్‌గా మారుతుంది. అలాగే 100°C వద్ద నీరు ఆవిరిగా మారుతుంది. అంటే ఒక రూపంలో ఉన్న నీరు మరొక రూపంలోకి మారుతుందన్న మాట.

**హమద్:** అవును అమ్మా మనం చలి కాలంలో కులిమనాలిక్ పోయినపుడు ఆ మంచు పై ఎంత బాగా స్కేటింగ్ చేసామో కదా. అక్కకు సరిగా చెయ్య రాక కింద పడింది.

**హనాన్:** అబ్బో... ఇలాంటివి నువ్వు బాగానే గుర్తుపెట్టుకుంటావు.

**హఫీజ్ :** నీకు తెలుసా హనాన్ చాలా పదార్థాలు ఘనీభవనం చెంది మందం అవుతాయి. అంటే వాటి ఘన పరిమాణం తగ్గి పోతుంది. కాని నీటి విషయంలో అది ఘనీభవనం చెందినపుడు ఘన రూపం చాలా తేలిక అయి అనగా ఘన పరిమాణం పెరిగిపోయి ఉపరితలం పై తేలియాడుతుంది.

**హనాన్:** అవును మామయ్యా అందుకే ధ్రువ ప్రాంతాలలో సరస్సులలో గడ్డ కట్టినప్పుడు మంచంతా పైన తెలియాడడం వలన దాని క్రింద నీరు ద్రవ స్థితిలోనే ఉంది జల చరాలన్నీ జీవించగలగుతున్నాయి కదూ.

**హఫీజ్:** అవును నువ్వన్నది అక్షరాల నిజం- అంతేకాదు పిల్లలు ఈ విధంగా నీరు రూపాలను మార్చుకోవడంలో ఎంతో శక్తిని వినియోగించుకుంటుంది. 1 గ్రాము నీరు ఐస్‌గా మారడానికి 80 కేలరీల శక్తిని వినియోగించుకుంటుంది. అదే 1 గ్రాము నీరు ఆవిరి కావడానికి 340 కేలరీల శక్తిని వినియోగించుకుంటుంది. దీని వలన భూమిపైన ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తుంటుంది.

**హయా:** భూమి పై సగటు ఉష్ణోగ్రత ఎంత మామయ్యా?

**హఫీజ్:** 15°C

**హమద్** : అవును నాన్న నీటికి ఇంత ప్రత్యేకమైన లక్షణాలు ఎలా వచ్చాయి?

**హసన్:** నీటికున్న ఈ ప్రత్యేక లక్షణాలు దానిలో ఉన్న హైడ్రోజన్ బంధాల వలన వచ్చింది. ఈ హైడ్రోజన్ బంధం గూర్చి చాలా రోజుల వరకు తెలియలేదు. 1920 సం.లో D.H. లారెన్స్ మొదటిసారిగా హైడ్రోజన్ బంధాల గూర్చి వివరించాడు. ఈ ప్రత్యేకమైన హైడ్రోజన్ బంధాల వల్లనే నీరు ప్రవహించగలదు, గడ్డ కట్టగలదు, ఆవిరి కాగలదు.

**హయా:** సుబ్హానల్లాహ్ ... నిజంగా నీటి గురించి వింటుంటే ఎంత అద్భుతంగా ఉంది.

**నదా:** అంతేకాదు, ఈ మహా అద్భుతమైన గుణాల వల్లనే ప్రకృతిలో జలచక్రం నిరంతరాయంగా కొనసాగి జీవజాతికి నీటిని అందిస్తుంది.

**హయా:** నాన్న జలచక్రం గూర్చి చెప్పవా ?

**హనాన్:** నేను చెబుతాను నాన్న నీటికి ఉన్న అద్భుతమైన లక్షణం భాష్పీ భవనం చెందడం అంటే నీరు నిరంతరాయంగా ఆవిరవుతు ఉంటుందన్న మాట. అలా ఆవిరయిన నీరు మేఘాలుగా మారుతాయి. ఈ మేఘాలు గాలి ద్వారా ఒక చోటు నుండి ఇంకో చోటుకు ప్రయాణిస్తుంటే చల్లని గాలి, తగిలినప్పుడు మేఘాలలోని నీటి ఆవిరి సాంద్రీకరణ చెంది నీటి బిందువులుగా మారుతాయి. అప్పుడా నీటి బిందువులు బరువుగా అయిపోయి కిందికి వర్ష రూపంలో పడుతుంది. అంతేకదా నాన్న.

**హసన్, హఫీజ్:** వెరీ గుడ్ హనాన్... చాలా బాగా చెప్పావు.

**హమద్:** నేను కూడా అక్కంత పెద్దగ అయితే బాగా వివరించగలను.

**నదా:** అలా బుంగమూతి పెట్టకు నాన్న హమద్. నువ్వు కూడా వెరీ గుడ్. నీకు కూడా చాలా విషయాలు తెలుసు. సరే గాని, మామయ్యను ఇలానే ఇంట్లో బందిస్తావా ? సరదాగా బీచ్ కు తీసుకెళ్ళుతావా ?

**హమద్:** వావ్ ... భలే గుర్తు చేశావ్ అమ్మా.. పద, పద పోదాం.

**హయా:** అమ్మా ఏమైనా స్నాక్స్ చేయి బీచ్‌లో తినడానికి (కారులో ప్రయాణిస్తూ...)

**హసన్** : నీటికున్న మరో ముఖ్యమైన లక్షణం ఏమిటో తెలుసా?

**హనాన్** : ఏమిటి నాన్నగారు?

**హసన్** : తలతన్యత. తలతన్యత అంటే పెద్ద మొత్తంలోని ఉపరితలం గురత్వాకర్షణ వలన ఒక సన్నటి సమతలంగా ఏర్పడుతుంది. ఇది కొంత భారాన్ని మోయగలిగి ఉంటుంది.

**హఫీజ్** : అవును ఈ తలతన్యత లక్షణం వల్ల దోమలు లాంటి కీటకాలు నీటి పైన వాలగలుగుతున్నాయి. నడవగలుగు తున్నాయి. నీటి పైన గుడ్లు పెట్ట గలుగుతున్నాయి.

**హనాన్** : అవును నాన్నగారు మా టీచర్ చెప్పుతుంటుంది. నిలువ ఉన్న నీటిలో గుడ్లు పెడతాయని. అవి చనిపోవాలంటే కిరోసిన్ పోయ్యాలని.

**హమద్** : కిరోసిన్ పోస్తే ఏమవుతుంది నాన్నగారు?

**హసన్** : కిరోసిన్ పోయడం వలన నీటి తలతన్యత తగ్గి నీటిపైన వాలిన కీటకాలు, కీటకాల గుడ్లు నీటిలో మునిగి చనిపోతాయన్న మాట.

(బీచ్‌లో సందడిగా ఉంటుంది....)

**హయా** : ఊ వచ్చేశాం దిగండి. అబ్బా ఎంత మంది వచ్చారు బీచ్ కు...

**హఫీజ్** : ఎండాకాలం కదా బీచ్‌లో చల్లగా ఉంటుందని చాలా మంది వస్తుంటారు.

**హయా** : అవును మామయ్యా బయటి వాతావరణం కంటే బీచ్‌లో చల్లగా ఉంటుంది ఎందుకు మామయ్యా?

**హఫీజ్** : ఇది కూడా నీటి గొప్పతనమే. భూమి త్వరగా వేడెక్కి పోతుంది. నీరు ఆలస్యంగా వేడెక్కుతుంది. అలాగే భూమి

త్వరగా చల్లారుతుంది. నీరు ఆలస్యంగా చల్లారుతుంది.

**హయా :** అయితే ఏంటి ?

**హఫీజ్ :** అయితే ఏంటంటే భూమి మొదటగా వేడెక్కుతుంది కదా. అందుచేత భూమి పై అల్పపీడనం ఏర్పడుతుంది. నీరు ఇంకా వేడెక్కదు కాబట్టి అక్కడ అధిక పీడనం ఉంటుంది. మీకు తెలుసు కదా పిల్లలు గాలి అధిక పీడనం నుండి అల్ప పీడనానికి ప్రసరిస్తుందని. అందుచేత సముద్రం పై నున్న చల్లటి గాలులు భూమి పైకి ప్రసరిస్తాయన్న మాట. అందుచేత పగటి పూట కూడా బీచ్‌లో చల్లగా ఉంటుంది. రాత్రి కాగానే భూమి చల్లబడుతుంది కాని సముద్రంలోని నీరు ఇంకా వెచ్చగానే ఉంటుంది. అప్పుడు సముద్రంపై అల్పపీడనం ఏర్పడుతుంది. భూమి పై అధిక పీడనం ఏర్పడుతుంది. అందుచేత భూమి పై నున్న చల్లటి గాలులు సముద్రం పైకి ప్రసరిస్తుంటాయి. అందుచేత సాయం కాలాలు కూడా బీచ్‌లో చల్లగా ఉంటుంది.

**నదా :** మామయ్య వచ్చిందగ్గరి నుండి నీటి గురించి అనేక విషయాలు చెప్పాడు. ఇకనైన నీ attitudeను మార్చుకుంటావా, నీటిని పొదుపు చేస్తావా?

**హమద్ :** ఇన్ని విషయాలు తెలుసుకున్న తరువాత ఇంకా పొదుపు చేయకుండా ఉంటానా? అమ్మా... నేను నీటిని పొదుపు చేయడమే కాదు పది మందీ నీటిని పొదుపు చేసేలా, మామయ్యలాగా అందరినీ చైతన్య పరుస్తా.

**హయా :** ఇదంతా విన్నాక నాకు నీటిపై ఒక కవిత చెప్పాలని ఉందమ్మా.

**నదా :** ఓ తప్పకుండ చెప్పు.

**హయా :** నీరే జీవాధారము

నీరే సమస్త జీవులకు ప్రాణం

అశ్రద్ధ చేస్తే తప్పదు జలరణం

నీరు మనకు ఎంతో పదిలం

నిర్లక్ష్యం చేస్తే జీవజాతి శిథిలం

జలాన్ని నిత్యం చేస్తే వృథా

తప్పదు అనునిత్యం వ్యథ

పొదుపు చేయకపోతే నీరు

చివరకు మిగిలేది కన్నీరు

నీరు లేనిదే మనం లేము

జలం లేనిదే జగం లేదు. వాహ్వా... వాహ్వా .... వాహ్వా

(అందరు చప్పట్లతో అభినందించారు...)


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# మాడ్రన్ ముస్లిం!!

- ముహమ్మద్ హనీఫ్

ముగ్గురు మిత్రులున్నారు.. వారి పేర్లు రామ్-రాబర్ట్-రహీమ్ అనుకుందాం.. వద్దులెండి, అసలే రోజులు బాగాలేవు.. ఎందుకొచ్చిన గొడవ. వారిపేర్లు X,Y,Z అనుకుందాం.

ముగ్గురూ బీటెక్ చదువుతున్నారు. ఫైనల్ పరీక్ష అయిపోయిన రోజు ముగ్గురు మిత్రులు మాంచి సెలెబ్రేషన్ మూడ్లో ఉన్నారు. ఆల్కహాల్‌తో మందుపార్టీ చేసుకుందామనుకున్నారు, కానీ "అది తప్పుకదా" అన్నాడు ఒకడు. "తప్పెలా అవుతుంది, ఆల్కహాల్ తాగడానికి ప్రభుత్వం నిర్దేశించిన కనీస వయసు 21 సంవత్సరాలు, మనం అది దాటేశాం. వైన్ షాపులకు ప్రభుత్వమే లైసెన్సులిచ్చి మరీ నడిపిస్తుంది, ఇక తప్పేముంది?" అని అడిగారు మిగతా ఇద్దరూ. మొత్తానికి, X,Yలు మద్యం మత్తులో మునిగి సేదతీరారు. Z మాత్రం కూల్ డ్రింక్‌తో సరిపుచ్చుకున్నాడు.

ముగ్గురూ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో సెలెక్ట్ అయి జాబ్‌లో జాయిన్ అయ్యారు. ప్రాజెక్ట్ డెలివరీ టైమ్ దగ్గరపడుతున్నకొద్దీ, పని ఒత్తిడి ఎక్కువైంది. రాత్రి 1,2 గంటల వరకూ పనిచేయడం, తెల్లవారాక 7,8 కి నిద్ర లేవడం.. ఇదే వీరికి దినచర్య అయింది. పొద్దున లేవగానే X,Y హుషారుగా ఉండేవారు గానీ, Zకి మాత్రం ఏదో వెలితిగా అనిపించేది. "తెల్లవారకముందే లేచి సృష్టికర్తను ఆరాధించడం"- అనే పని మిస్ చేస్తున్నందుకు గిల్టీ ఫీలింగ్ కలిగేది. పగటి పూట ఆఫీస్ క్యాంటిన్‌లో, సోషల్ మీడియాల్లో, వేస్ట్ చేస్తున్న టైమ్‌ని ఆఫీస్ పనికి వినియోగించుకుని అయినా సరే త్వరగా నిద్రపోయి తెల్లవారక ముందే లేవాలని ప్రయత్ని స్తున్నాడు.

ప్రాజెక్ట్ డెలివరీ సక్సెస్ఫుల్‌గా చేసినందుకు వీరి కంపెనీ బోనస్‌లు ప్రకటించింది. దాంతో పాటే రిలాక్సేషన్ కోసం ఫారెన్‌లో హాలిడే ప్యాకేజ్‌లు కూడా ఆఫర్ చేసింది. X,Yలు థాయ్‌లాండ్‌కి వెళ్లి ఆయిల్ మసాజ్‌లు, రష్యన్ అమ్మాయిలతో స్యాండ్ విచ్ మసాజ్‌లు చేసుకుందామన్నారు. "ఇది తప్పుకదా" అన్నాడు Z. "తప్పేముంది, మన ప్రభుత్వం మనకు పాస్‌పోర్టులిస్తుంది. థాయ్‌లాండ్ ప్రభుత్వం మనం మసాజ్ కోసం వస్తున్నామని తెలిసే, మన దగ్గర డబ్బులు తీసుకుని మరీ మనకు టూరిస్ట్ వీసాలిస్తుంది. అక్కడ పనిచేస్తున్న వివిధ దేశాల అమ్మాయి లందరూ అడల్ట్సే, తామేం చేస్తున్నామో పూర్తిగా తెలిసే, స్వచ్ఛందంగానే చేస్తున్నారు. పైగా గంటకింత అని వసూల్ చేసుకుని వారు కూడా లాభపడుతున్నారు. ఇక దీన్లో తప్పే ముంది?"- అని ప్రశ్నించారు. మొత్తానికి Z లేకుండానే, X,Yలు థాయ్‌లాండ్ వెళ్ళి వచ్చారు.

జీతం డబ్బుల్లో, ఖర్చులకు పోను మిగులు సొమ్మును X,Yలు ఫిక్స్ డిపాజిట్లుగా బ్యాంకుల్లోనూ, లేకపోతే మిత్రులకు వడ్డీలకు ఇచ్చారు. "వడ్డీ తప్పుకదా" అన్నాడు -Z. "ప్రభుత్వమే FDలు కట్టండి మొర్రో అని మొత్తుకుంటుంది, మాకు వడ్డీకి అప్పుకావాలి అని తీసుకున్నోళ్ళే మా దగ్గరకు వచ్చారు, ఇక దీన్లో కూడా తప్పేముంది?" అని X,Yలు వింతగా చూశారు. అలా వచ్చిన లాభంతో OYO కంపెనీ షేర్లు కొన్నారు. OYO అంటే వివిధ నగరాలు, పట్టణాల్లో లాడ్జి రూముల నెట్వర్క్. ఒక స్త్రీ-పురుషుడు, వాళ్ళిద్దరూ భార్యా-భర్తనా కాదా అనే దాంతో సంబంధం లేకుండా, వారు అడల్ట్స్ అయితే చాలు ఇంక ఏమైనా చేసుకోవచ్చు, అది తప్పుకాదు అనే సుప్రీమ్‌కోర్టు తీర్పు ఆధారంగా OYO రూముల బిజినెస్ పచ్చగా కళకళలాడుతూంది. దాన్లో ఉండటానికి వచ్చేవారి పేరు, వయసు మాత్రమే అడుగుతారు తప్ప, మీ ఇద్దరికీ సంబంధమేంటి, ఎందుకొచ్చారు లాంటివి అడగరు. షేర్లలో ఇన్వెస్ట్ చేయడం తప్పుకాదు గానీ, ఇలాంటి షేర్లు కొనడం మాత్రం తప్పు అని Z ఆ షేర్లు కొనలేదు. SEBIలో లిస్ట్ అయి ఉన్న షేర్లు తప్పంటాడు వీడెవడండీ బాబు అనుకుంటూ X,Yలు ఇన్వెస్ట్ చేశారు, ఆ డబ్బును రెండింతలు, నాలుగింతలు చేసుకున్నారు.

ముగ్గురూ పెళ్ళీడుకు వచ్చారు. X,Yలు డేటింగ్ యాప్‌లలో చెరొక అమ్మాయితో అండర్‌స్టాండింగ్‌కి వచ్చి లివ్ ఇన్ రిలేషన్‌లోకి వెళ్ళారు. ఏడాది అయిపోగానే బోర్ కొట్టేసి, ఇంకో ఇద్దరిని మార్చారు. అంతా లీగలే. "ఇదంతా తప్పుకదా" అనుకున్న Z

మాత్రం, పెళ్ళి చేసుకుని భార్యా-భర్తా ఏవో తంటాలు పడుతున్నారు.

ఈ Z అనేవాడు ముస్లింలా ఉన్నాడే అని మీకనిపిస్తుందా..సరే దాన్నే ఖాయం చేసుకుందాం.

★★★

ప్రస్తుత సోకాల్డ్ ఆధునిక సమాజాలన్నీ- "మినిమైజింగ్ పెయిన్- మ్యాగ్జిమైజింగ్ ప్లెజర్ (సుఖం)" అనే బెంచ్ మార్క్ ఆధారంగానే నడుస్తున్నాయి, వాటికి తగ్గట్లే వివిధ చట్టాల్ని రూపొందించు కుంటున్నాయి. ఈ సమాజ చట్టాలకు అనుగుణంగానే దాదాపు అన్ని మతాలూ రూపాంతరం చెంది, కేవలం పండగల్ని సెలబ్రేట్ చేసుకోవడం వరకే పరిమితమయ్యాయి.

"మానవ నిర్మిత చట్టాలకు లోబడి బతకడమే మంచితనం"- అనే పాపులర్ పర్సెప్షన్ ప్రకారం చూస్తే, X,Y,Zలు ముగ్గురూ మంచోళ్ళే. మరి ఇస్లాంని పాటించడం వల్ల బోలెడంత ఫన్ మిస్సవడం తప్ప, Zకి ఏం ఒరిగింది అనే ప్రశ్నకు ముస్లింలందరూ సమాధానం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

దీనికి సమాధానంగా రెండు పాయింట్లు ప్రముఖంగా చెప్పాల్సి ఉంటుంది.

1. "మరణానంతర జీవితంతో పోల్చితే ఈ జీవితం సముద్రంలో నీటిచుక్క లాంటిది. ఈ జీవితం కేవలం ప్లెజర్ కోసమో, ఎంటర్ టైన్‌మెంట్ కోసమో కాదు, సృష్టికర్త ఆదేశానుసారం జీవించిన వారికి, దానికి తగ్గ ప్రతిఫలం తప్పక దొరుకుతుంది"- అనే సందేశాన్ని ఖురాన్ అనేక ఆయాత్‌లలో సుస్పష్టంగా ప్రకటించింది.

2. అసలు ప్లజర్ కలిగించేవిగా పాపులర్ పర్సెప్షన్‌లో చలామణీలో ఉన్న పనులు, నిజంగానే ప్లజర్ ఇస్తాయా, ఇచ్చినా ఎన్ని రోజులు ఇస్తాయి, తర్వాత వాటి పరిణామాలెలా ఉంటాయి.. అనేవి ఆలోచించాల్సిన ప్రశ్నలు. ఈ "మినిమైజ్ పెయిన్- మ్యాగ్జిమైజ్ ప్లెజర్" అనే నాస్తిక లిబరల్ అజెండా, ఇండియాలో ఈ మధ్యనే ప్రవేశించిందిగానీ యూరప్, యూకే, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ లాంటి సోకాల్డ్ అభివృద్ధి చెందిన దేశాల్లో చాలా ముందు నుండే అది అమల్లో ఉంది. దాని దుష్పరిణామాల్ని ఆ సమాజాలు ప్రస్తుతం చవిచూస్తున్నాయి. కేవలం కెరీర్, సంపాదనల మీద మాత్రమే ఫోకస్ పెట్టిన యువతీ యువకులు- పెళ్ళి, పిల్లలు లాంటి బాధ్యతల పట్ల ఆసక్తి చూపకపోవడం, ఫలితంగా జనాభా వృద్ధి రేటు పడిపోయి, సమాజంలో యువకుల సంఖ్య కంటే, వృద్ధుల సంఖ్య అనేకరెట్లు పెరిగిపోవడం- పుట్టిన కొందరు పిల్లలు కూడా చక్కని కుటుంబ వాతావరణంలో కాకుండా, లివ్-ఇన్ కల్చర్‌ల కారణంగా సింగిల్ ఫాదర్, సింగిల్ మదర్ వంటి పెంపకంలో పెరగడం వల్ల, యాంగ్జైటీ లాంటి అనేక మానసిక సమస్యలతో సతమతమవుతున్నారు. వడ్డీ వ్యవస్థ కారణంగా డబ్బున్నోడు మరింత ధనికుడిగా, పేదోడు మరింత పేదరికంలో కూరుకుపోయి, ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం (రిసెషన్) లాంటివి సాధారణం అయిపోయాయి. దీని ఫలితంగా, భార్యా-భర్త ఇద్దరూ పనిచేసినా కూడా సెక్యూర్డ్ లైఫ్ దొరక్క, EMIల వలయంలో చిక్కుకుని డిప్రెషన్‌లకు గురవుతున్నారు. వీటితోపాటు డ్రగ్స్, రేప్స్, క్రైంస్, సూసైడ్స్ లాంటివి వెస్టర్న్ దేశాల సమాజాల్లో నిత్యకృత్యమైపోయాయి.

ముస్లిం సమాజాల్లో ఏ చిన్న నెగెటివ్ వార్త కనబడినా గోరంతను కొండంత చేసి చూపించే గోబెల్స్ మీడియా, వెస్టర్న్ సమాజాల్లోని ఇలాంటి విషయాల గురించి మాత్రం ఏనాడూ ఫోకస్ చేయదు.

## ముస్లిం అంటే..?

"లా ఇలాహ ఇల్లల్లాహ్.. ముహమ్మదుర్రసూలుల్లాహ్" అని ప్రకటించిన వారే ముస్లింలు. అల్లాను ప్రసన్నం చేసుకోవాలనే ఏకైక లక్ష్యంతో, ప్రవక్త మహమ్మద్(స) గారి మార్గాన్ని మనసా వాచా కర్మణా అనుసరించేవారు అని అర్థం. కానీ, నాస్తిక- లిబరల్ ఎజెండా ఆధారంగా నడిచే సమాజాలు, ఇస్లాం హరామ్‌గా డిక్లేర్ చేసిన విషయాల్ని చట్టబద్ధం చేస్తూ, ఇస్లాం పై నడవడాన్ని మాత్రం కష్టతరం చేయడమే పరమావధిగా పనిచేస్తున్నాయి. ముస్లింలు దీనిని చాలెంజింగ్‌గా తీసుకుని ఇస్లామిక్ జీవన విధానాన్ని మరింతగా పుణికిపుచ్చుకోవాల్సిన అవసరం ఉంది. ఏదేమైనా, పరీక్ష ఎంత కఠినమైనదైతే, దాని ఫలితం అంత ఎక్కువగా తృప్తినిస్తుంది కదా. ఈజీ టార్గెట్స్‌ని అచీవ్ చేయడంలో మజా ఏముంది. మొత్తానికి, ఆధునిక జీవన విధానం విసురుతున్న సవాళ్లను, ముహమ్మద్ సల్లల్లాహు వసల్లం గారి ఉమ్మత్ విజయవంతంగా అధిగమిస్తుందని ఆశిద్దాం.. దుఆ చేద్దాం. ❖


తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# వ్యాధిగ్రస్తుల పరామర్శ
# అల్లాహ్ ప్రసన్నతకు మార్గం

ప్రవక్త మహనీయుల (సఅసం) వారి సత్య సందేశం అదే ప్రాంతంలో ఉన్న ఒక మహిళకు నచ్చలేదు. దీంతో ఆమె ప్రవక్త మహనీయుల వారిని తీవ్రంగా ద్వేషించేది. ఇంట్లో కసువును, చెత్తాచెదారాన్ని ప్రోగు చేసి కాపుకాసి ఆయనపై పోసేది. పని గట్టుకుని ఆయన రాక కోసం ఎదురు చూసేదంటే ప్రవక్త పట్ల ఎంత ద్వేషం ఉండేదో. ప్రవక్తపై చెత్తను పోసి పైశాచికానందాన్ని అనుభవించేది. ప్రవక్త మహనీయుల వారు ఆమెను పల్లెత్తు మాట కూడా అనేవారు కాదు. తమపై పడ్డ చెత్తను శుభ్రం చేసుకుని తన దారిన తాను వెళ్లేవారు. ఒకరోజు ఇలానే ప్రవక్త(స) వారిపై చెత్త పడలేదు. అలా ఆ రోజంతా ఒకటికి నాలుగుసార్లు ఆమె ఇంటి చుట్టూ తిరిగారు. కానీ ప్రవక్త (స) వారిపై చెత్తపడలేదు. తనపై రోజూ చెత్త వేసే మహిళ ఆరోగ్యం చెడిపోయి అనారోగ్యం పాలై ఉంటుందనే అనుమానంతో ఆమె ఇంటి తలుపు తట్టారు. లేవలేని స్థితిలో ఉన్న ఆ మహిళ 'ప్రవక్తను ఇంట్లోకి ఆహ్వానించింది. ఇంటి పరిస్థితి చూసి 'ఆమె అనారోగ్యంతో బాధపడుతోందని తెలుసుకుని ఇల్లంతా శుభ్రం చేశారు. చెత్తను ఒక బుట్టలో పోగుచేశారు. లేవలేక నిస్సహాయ స్థితిలో ఉన్న ఆమె ఎవరొచ్చుంటారోననే సందేహానికి లోనవు తోంది. ఇంతలో ఆమెకు తినేందుకు ఆహారం సిద్ధం చేసి అందించారు. ప్రవక్త (స) వారిని చూసి ఆ మహిళ ఆశ్చర్యానికి లోనయింది. 'యే ముహమ్మద్‌పై నేను చెత్తా చెదారం వేసేదాన్నో ఆ ముహమ్మద్ నేను రోగాన బారిన పడితే నన్ను పరామర్శించి నాకు సపర్యలు చేశారా' అని కన్నీరొలికింది. మరుక్షణమే ప్రవక్తను విశ్వసించింది. ఈ సంఘటన వ్యాధి పరామర్శ ఎంత ప్రాధాన్యత సంతరించుకుందో తెలియజేస్తోంది. తమను ప్రేమించే వారయినా, ద్వేషించేవారయినా అనారోగ్యానికి పాలయితే పరామర్శించాలన్న గుణపాఠం ఈ సంఘటన చెబు తుంది. తోటి ముస్లిమ్‌పై ఉన్న ఆరు హక్కుల్లో ఒకటేమిటంటే 'మీ తోటి ముస్లిమ్ సోదరుడు అస్వస్థతకు, వ్యాధికి గురయితే అతన్ని పరామర్శించాలి.' వ్యాధిగ్రస్తుని పరామర్శించడంలో దేవుని ప్రసన్నత లభిస్తుంది. ప్రళయ దినాన దేవుడు "ఆదమ్ కుమారా, నేను జబ్బు పడ్డాను కానీ నువ్వు నన్ను పరామర్శించ లేదు' అంటాడు. అప్పుడు దాసుడు 'దేవా, నీవు సర్వ విశ్వానికి దేవుడవు. నువ్వు జబ్బు పడటమేంటి, నేను పరామర్శించడ మేమిటి? అని అంటాడు. అప్పుడు ప్రభువు 'నా ఫలానా దాసుడు రోగ పీడితుడయి ఉంటే నీవు అతడిని పరామర్శించ లేదు. నీవు అతడిని పరామర్శించి ఉంటే నువ్వు నన్ను అక్కడ కానగలిగేవాడివి' అనే సమాధానం లభిస్తుంది. అంటే వ్యాధిగ్రస్తుని పరామర్శలో దైవ ప్రసన్నత, దైవప్రీతి లభిస్తుం దన్నది ఈ ప్రవచనం మనకు తేటతెల్లం చేస్తుంది. ఆరోగ్యమే మహా భాగ్యమన్నారు. మంచి ఆరోగ్యం ప్రసాదించినందుకు నిత్యం అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ఎవరైనా మన తోటి వారు, బంధుమిత్రులు, తెలిసిన వారు అనారోగ్యానికి గురైతే వారిని తప్పకుండా పరామర్శించి త్వరగా కోలుకోవా లని అల్లాహ్‌ను ప్రార్థించాలి. వారికి ధైర్యాన్నివ్వాలి. రోగిని పరామర్శించడం కూడా దైవారాధనతో సమానం. ఇస్లామ్ విశ్వా సంలో భాగం. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, అనాథల తల నిమరడం, రోగ పీడితులను పరామర్శించి వారితో నాలుగు ఓదార్పు మాటలు చెప్పడం కూడా దైవారాధనతో సమానమని ప్రవక్త బోధన సారాంశం. ప్రవక్త మహనీయుల వారు ఎదుటి వారు కష్టాల్లో ఉన్నా, రోగాల బారిన పడినా ఎంతగానో చలించిపోయే వారు. వారి అసౌకర్యాన్ని, వారి బాధను దూరం చేసేవారు. అల్లాహ్‌ను ప్రార్థించేవారు. వ్యాధిగ్రస్తులను పరామర్శించడం, వారిని ఓదార్చడం పుణ్యకార్యాల్లో ఉత్తమ మైన కార్యంగా చెప్పారు. వ్యాధిగ్రస్తులను ఎలా పరామర్శించాలి అనే కొన్ని సూచనలనూ ప్రవక్త చేశారు. 'ఎవరైతే ఉదయం పూట వ్యాధిగ్రస్త సోదరుణ్ణి పరామర్శిస్తారో అలాంటి వ్యక్తిని సాయంత్రం వరకూ అతని మన్నింపుల కోసం దైవదూతలు ప్రార్థిస్తాయి. ఎవరైనా రాత్రి పూట వ్యాధిగ్రస్త సోదరుణ్ణి పరామర్శిస్తారో తెల్లారే వరకూ దైవదూతలు అతని మన్నింపుకై అల్లాహ్‌ను వేడుకుంటాయి. ప్రవక్త మహనీయుల వారు వ్యాధిగ్రస్తుని పరామర్శించినప్పుడు ఆ రోగ పీడితుని తలవైపు కూర్చుని "ఓ అల్లాహ్ ఈ వ్యాధిగ్రస్తుని బాధను తొలగించు. ఇతనికి స్వస్థతతను ప్రసాదించు. ఇతని వ్యాధి నామరూపా ల్లేకుండా చేయి. త్వరగా ఉపశమనం ప్రసాదించు" అని త్వరగా కోలుకోవాలని ప్రార్థించేవారు. వ్యాధిగ్రస్తుని పరామర్శించడంలో మరో ప్రయోజనం ఏమిటంటే మనకు ఆరోగ్యం విలువ తెలిసి వస్తుంది. ఆరోగ్యాన్ని అనారోగ్యానికి పూర్వం మేలైనదిగా భావించాలన్న ప్రవక్త మాటను పాటిస్తే అదే మనకు వరాల మూట అవుతుంది.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**